
ఒక మనిషి గొప్పతనం అతని మెదడులో కాదు హృదయంలో ఉంటుంది
-మహాత్మా గాంధీ


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 240 | గురువారం 19 ఫిబ్రవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## భారత్‌కు ఇది
# చరిత్రాత్మక సమయం

- భారత్ ఒక గొప్ప సాంకేతిక పరివర్తన దశలో ఉందన్న సుందర్ పిచాయ్
- దేశ భవిష్యత్తును ఏఐ నిర్దేశించబోతోందని ఉద్ఘాటన
- ప్రధాని మోదీతో భేటీ, ఏఐపై సహకారానికి చర్చలు
- గూగుల్ జెమినైకి భారత్ అతిపెద్ద మార్కెట్లలో ఒకటి అని వెల్లడి
- అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో కలిసి విద్యార్థులకు కోడింగ్, రోబోటిక్స్



2లో

## చైనా రోబోను మనదిగా చూపించి
# అవమానించారు..

- చైనా మీడియా ఎగతాళి చేస్తోంది: రాహుల్ గాంధీ
- ఏఐ ఇంపాక్ట్ సదస్సులో గల్గోటియాస్ వర్సిటీ స్టాల్ ఏర్పాటు
- చైనా అభివృద్ధి చేసిన రోబోను తమదిగా పేర్కొంటూ స్టాల్‌లో ప్రదర్శన
- కేంద్రం పీఆర్ స్టంట్స్ చేస్తోందని రాహుల్ గాంధీ ఆగ్రహం
- చైనా అభివృద్ధి చేసిన రోబోను మనదిగా చూపించారని ఆగ్రహం



2లో

# సార్వభౌమత్వానికి నేవీ ప్రతీక

- ప్రపంచ దేశాలతో భారత్ స్నేహ సంబంధాలు స్ఫూర్తిదాయకమని రాష్ట్రపతి ప్రశంస
- విశాఖ సాగర తీరంలో ఉత్సాహంగా ఐఎఫ్ఆర్

గ్రేటర్ విశాఖ– సూర్య వాస్తవం

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) ఉత్సాహంతో విశాఖ సాగరం బుధవారం మురిసింది. ఉదయం 9.55 గంటలకు బంగాళాఖాతంలో అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష ప్రారంభమై.. ఆద్యంతం ఉత్తేజంగా, ఉత్సాహంగా సాగింది. ఐఎఫ్ఆర్‌కు ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరై మాట్లాడారు. దేశ సార్వభౌమత్వానికి భారత నావికాదళం ప్రతీకగానూ, ప్రపంచ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడంలోనూ స్ఫూర్తిదాయకంగానూ నిలుస్తోందని కొనియాడారు. ఐఎఫ్ఆర్‌లో పాల్గొనడం తనకు చాలా గర్వంగా ఉందని, ఎంతో ఆనందాన్ని కలిగించిందని అన్నారు. ఐఎన్ఎస్ సుమేధ డెక్ నుంచే నావికులనుద్దేశించి ఆమె ప్రసంగించారు. విశాఖపట్నం అనే సముద్రతీర మహా నగరంలో ఈ గౌరవ ప్రదమైన ఐఎఫ్ఆర్ జరగడం గొప్ప విషయమన్నారు. 'ఐఎఫ్ఆర్ శక్తి సామర్థ్యాల ప్రదర్శనే కాదు..

- మిగతా 2లో..





## డ్రగ్స్‌ను అరికట్టడంలో
# కూటమి ప్రభుత్వం విఫలమైంది

- ముక్కుపచ్చలారని పసిబిడ్డపై గంజాయి మత్తులో జరిగిన పైశాచికం ఇది
- మదనపల్లిలో బాలికపై జరిగిన అఘాయిత్యంపై వైఎస్ షర్మిల తీవ్ర విచారం
- గంజాయి మత్తులోనే ఈ దారుణం జరిగిందని ఆరోపణ
- గంజాయిపై ఉక్కుపాదం మోపాలని సీఎం చంద్రబాబుకు డిమాండ్
- బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి

అమరావతి – సూర్య వాస్తవం

మదనపల్లెలో ఏడేళ్ల బాలికపై జరిగిన హత్యాచారం అత్యంత దారుణమని, గంజాయి మత్తులో ముక్కుపచ్చలారని పసిబిడ్డపై జరిగిన ఈ పైశాచిక ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ దారుణ ఘటన పట్ల

- మిగతా 2లో..

## 15వ ఎస్ఐపీబీ సమావేశం...
## 27 ప్రాజెక్టులు, రూ.29,021 కోట్ల
# పెట్టుబడులకు సీఎం ఆమోదం

- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 22,407 ఉద్యోగాల కల్పన
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే ప్రాతిపదిక కావాలన్న సీఎం
- ప్రాజెక్టుల పురోగతిపై ఇకపై ప్రతినెలా సమీక్షించనున్న ముఖ్యమంత్రి
- విశాఖలో దేశంలోనే అత్యుత్తమంగా 'భారత్ మండపం' నిర్మాణం

అమరావతి– సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, ఆమోదం పొందిన ప్రతీ ప్రాజెక్టు వేగంగా కార్యరూపం దాల్చాలని ఆయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 15వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో



- మిగతా 8లో..

## బొత్స సత్యనారాయణ
# పట్టు కోల్పోయారు

- మంత్రి నారా లోకేశ్
- తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంపై మండలిలో చర్చకు పట్టుబట్టిన వైసీపీ
- వైసీపీ తీర్మానాలను డిస్మిస్ చేసిన మోషేన్ రాజు
- అసెంబ్లీలో చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారన్న బొత్స

8లో

# అంబటి రాంబాబుకు బెయిల్..

- కస్టడీ పిటిషన్ కొట్టివేత
- సంక్రాంతి లక్కీడ్రా కేసు
- బెయిల్ రావడంతో జైలు నుంచి విడుదల కానున్న అంబటి
- జనవరి 31 నుంచి జైల్లో ఉన్న వైసీపీ మాజీ మంత్రి

8లో


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


# గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత

హైదరాబాద్– సూర్య వాస్తవం

ప్రపంచ పరిరక్షణకు గ్రీన్‌ఎనర్జీ కీలకమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రీన్‌ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్టు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో దీన్ని ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 30 లక్షలకుపైగా పంప్‌సెట్లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. బొగ్గు,



- మిగతా 8లో..

- వేగవంతమైన అభివృద్ధి కోసం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజన
- పట్టణాభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం : 
- ముంబయి 'క్లైమెట్ వీక్' సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

భారతదేశం ఒక గొప్ప సాంకేతిక పరివర్తనకు నాంది పలుకుతోందని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషించనుందని ఆల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. ప్రస్తుత దశను పరివర్తన సమయంగా ఆయన అభివర్ణించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ఇది టెక్నాలజీ, ఆవిష్కరణలు, మరియు ఏఐ విస్తృత వినియోగంతో నడిచే ఒక దశాబ్ద కాలపు మార్పుకు నాందిలా అనిపిస్తోంది" అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా లబ్ధి పొందేందుకు భారతదేశం ప్రత్యేకమైన స్థితిలో ఉందని, అయితే ఈ అవకాశంతో పాటు గొప్ప బాధ్యత కూడా ఉంటుందని సుందర్ పిచాయ్ నొక్కిచెప్పారు. ఏఐ పరిశోధనలలో బలమైన పెట్టుబడులు పెట్టాలని, దాని వినియోగాన్ని అన్ని రంగాలకు విస్తరించాలని ఆయన సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి విభాగానికి ఏఐ ప్రయోజనాలు చేరేలా పునాది స్థాయి నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. గత కొన్నేళ్లుగా భారత్ డిజిటల్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించిందని పిచాయ్ ప్రశంసించారు. "భారతీయ వినియోగదారులు వాయిస్ ఆధారిత, ఇమేజ్ ఆధారిత సెర్చ్‌లను ప్రపంచంలోనే అత్యధికంగా స్వీకరిస్తున్నారు. ఇది దేశ ప్రజలు కొత్త టెక్నాలజీలను ఎంత వేగంగా అందిపుచ్చుకుంటున్నారో చూపిస్తోంది," అని ఆయన తెలిపారు. గూగుల్ ఏఐ టూల్ 'జెమినై'కి భారతదేశం అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా నిలవడం, ఇక్కడి వినియోగదారులలో ఏఐ పట్ల పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, సుందర్ పిచాయ్ ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏఐ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి, దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులతో గూగుల్ ఎలా కలిసి పనిచేయగలదనే అంశాలపై వారు చర్చించారు. ఈ భేటీపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఏఐ రంగంలో ప్రభుత్వం, గూగుల్ మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకునే అవకాశాలపై పిచాయ్‌తో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు తెలిపారు.

భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరాన్ని కూడా పిచాయ్ ప్రస్తావించారు. పాఠశాల విద్యార్థులలో చిన్న వయసు నుంచే ఆవిష్కరణ, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్'తో కలిసి గూగుల్ పనిచేస్తోందని, తరగతి గదుల్లోకి రోబోటిక్స్, కోడింగ్‌ను తీసుకువెళుతున్నామని వివరించారు. సరైన పెట్టుబడులు, విధానాలు అమలు చేస్తే, భారతదేశ సమగ్ర అభివృద్ధికి, దీర్ఘకాలిక పరివర్తనకు ఏఐ ఒక శక్తివంతమైన సాధనంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## చైనా రోబోను మనదిగా చూపించి అవమానించారు..

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ విశ్వవిద్యాలయం చైనా రోబోడాగ్‌ను తాము అభివృద్ధి చేసినట్లుగా పేర్కొంటూ ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. ఈ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సదస్సులో నుంచి గల్గోటియాస్ విశ్వవిద్యాలయానికి ఉద్వాసన పలికింది. ఈ వివాదంపై లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సును అధ్వానంగా నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్ ప్రతిభను ప్రపంచానికి చూపకుండా పీఆర్ స్టంట్ చేస్తున్నారని ఆరోపించారు. భారతీయుల డేటాను అమ్మకానికి పెట్టి చైనా ఉత్పత్తులతో షో చేస్తున్నారని విమర్శించారు. చైనా అభివృద్ధి చేసిన రోబోలను మనవిగా చూపించి అవమానాలకు గురి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ సమ్మిట్‌ను ఒక జోక్‌గా మార్చారని మండిపడ్డారు. భారతదేశం ప్రతిభను కనబర్చాల్సిన చోట ఈ తీరు దారుణమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏఐ సదస్సు ద్వారా ప్రపంచవ్యాప్తంగా దేశాన్ని నవ్వులపాలు చేసిందని అన్నారు. చైనా రోబోలను మనవిగా ప్రదర్శించినందుకు ఆ దేశ మీడియా మనల్ని ఎగతాళి చేస్తోందని అన్నారు. ఇది దేశానికి నిజంగా ఇబ్బందికరమైన పరిణామమని అన్నారు.

## డ్రగ్స్‌ను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నామని, బాలిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలు ఏరులై పారుతున్నాయనడానికి మదనపల్లె ఘటనే నిదర్శనమని షర్మిల ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై డేగ కన్ను పెట్టామని, ఉక్కుపాదం మోపుతామని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడమంతా ఆర్భాటమేనని విమర్శించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారమంతా తూతూ మంత్రంగానే మిగిలిపోయిందని ఆమె దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని విమర్శించారు. బాధిత బాలిక కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పైశాచిక ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో వ్యక్తిగతంగా దృష్టి సారించాలని, గంజాయి, డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపడంతో పాటు నిరంతరం నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రాష్ట్రాన్ని కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని షర్మిల స్పష్టం చేశారు.

## అంబటి రాంబాబుకు బెయిల్..

అమరావతి- సూర్య వాస్తవం

2023 సంక్రాంతి లక్కీ డ్రా కేసులో మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అంబటిని కస్టడీకి కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. ఈ క్రమంలో, జనవరి 31 నుంచి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న అంబటి ఇప్పుడు బయటకు రావడం ఖాయమైంది. ఇటీవల మరో రెండు కేసుల్లో అంబటికి బెయిల్ మంజూరు అయిన తర్వాత... ఆయనపై సంక్రాంతి లక్కీ డ్రా కేసులో పీటీ వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ కేసులో కూడా గుంటూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దాంతో అంబటి జైలు నుంచి విడుదల కానున్నారు. ఈ నేపథ్యంలో, వైసీపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. అంబటిపై సంక్రాంతి లక్కీ డ్రా కేసును ఒక జనసేన నాయకుడు పెట్టిన సంగతి తెలిసిందే.

# సార్వభౌమత్వానికి నేవీ ప్రతీక

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయ స్నేహ బంధాలకు ప్రతీక. సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం, సముద్ర దోపిడీ నియంత్రణ వంటి అంశాల్లో అంతర్జాతీయ సహకారం ఎంతో అవసరం. మన దేశీయ యువతకు ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాల్లోగల విద్యార్థులకు భారత నౌకాదళం స్ఫూర్తిదాయకం' అని ఆమె అన్నారు. ప్రపంచ శాంతిని కాపాడడంలో భారతదేశం ముందుండాలని ఆకాంక్షించారు. 'భారతదేశం ఒక సముద్ర వారసత్వం కలిగిన దేశం. శతాబ్దాలుగా మన సముద్ర మార్గాలు వాణిజ్యానికి, సంస్కృతీ సంప్రదాయాలకు, భద్రతకు కీలక కేంద్రంగా నిలుస్తూ వస్తున్నాయి. నేడు మన ముందున్న ఈ నౌక విన్యాసాలు భారత నావికాదళ శక్తి, సాంకేతిక నైపుణ్యం, క్రమశిక్షణకు ప్రతీకగా నిలుస్తాయనడంతో ఎలాంటి సందేహమూ లేదు. ఇండియన్ నేవీ దేశ సార్వభౌమత్వాన్ని, సార్వభౌమాధికారాన్ని కాపాడటమే కాకుండా సముద్రమార్గాల ద్వారా భద్రత, రక్షణ, మానవతా సహాయ కార్యక్రమాలు, విపత్తు సహాయక చర్యల్లోనూ అత్యంత కీలక పాత్రను పోషిస్తోంది. సురక్షిత సముద్రం -- సమృద్ధి భారత్ అనే లక్ష్యంతో మన నౌకాదళం చేస్తున్న కృషికి అభినందిస్తున్నాను' అంటూ రాష్ట్రపతి తన ప్రసంగాన్ని ముగించారు.

**ప్రతిష్టాత్మకంగా ఐఎఫ్ఆర్**

తొలుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తూర్పునౌకాదళ ప్రధాన కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ నుంచి ఐఎన్ఎస్ సుమేధ యుద్ధనౌకలో ప్రయాణించారు. ఆ నౌక నుంచే ఆమె రెండు గంటలకు పైగానే ఐఎఫ్ఆర్‌ను సమీక్షించారు. ఆమెతో పాటు భారత నౌకాదళ ప్రధాన అధికారి దినేష్ కె త్రిపాఠి, ఎపి గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజినోవా, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, తూర్పు నౌకాదళం వైస్ అడ్మిరల్ సంజరు భల్లా, ఇతర అధికారులు ఉన్నారు. ఆరు వరుసల్లో నిలిపిన 71 యుద్ధ నౌకల్లోని నావికాదళ సిబ్బంది నుంచి రాష్ట్రపతి ముర్ము తొలుత గౌరవ వందనాన్ని స్వీకరిస్తూ ముందుకు సాగారు. యుద్ధ విమానాలు, హెలికాప్టర్‌లు, ఫ్లై పాక్‌లు, బ్లాక్ పాంథర్లు ఆకాశంలో రరు రరుమంటూ ఎగురుతూ విన్యాసాలు చేశాయి. యుద్ధనౌకలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు, జలాంతర్గాముల విశిష్టత, వాటి శక్తి సామర్థ్యాలను నౌకాదళ అధికారులు మైకు ద్వారా వినిపించడంతో బంగాళాఖాతంలో ప్రయాణిస్తున్న 71 నౌకల్లో ఉన్నవారికీ ఈ అంశాలు స్పష్టంగా వినిపించాయి. ఆ నౌకలు ఐఎన్ఎస్ సుమేధను సమీపించే సరికి రాష్ట్రపతి నిల్చొని వారికి అభివాదం చేశారు. ఈ ఫ్లీట్ రివ్యూకు వివిధ దేశాల నుంచి సుమారు 400 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

**యుద్ధనౌకలు, విమానాల సందడి**

సుమారు రెండు గంటల పాటు యుద్ధనౌకలు, విమానాల విన్యాసాలు కొనసాగాయి. 55 దేశాలకు చెందిన 19 యుద్ధనౌకలు, ఇండియన్ నేవీకి చెందిన 45 యుద్ధ నౌకలు, మరో ఏడు కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధక నౌకలు వెరసి 71 వరకూ విన్యాసాల్లో భాగస్వామ్యమయ్యాయి.

సింధూర్ ఆపరేషన్ సందర్భంగా కీలకంగా వ్యవహరించిన విమాన వాహక యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ఈ ఐఎఫ్ఆర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో పాటుగా భారత యుద్ధనౌకలు ఐఎన్ఎస్ చెన్నరు, విశాఖపట్నం, ముంబై, మైసూర్, ఐఎన్ఎస్ రాణా, రణ్‌వీర్, తరఖాన, తమల్, నీలగిరి, హిమగిరి, ఉదయగిరి ఇలా వివిధ నౌకలు ఐఎఫ్ఆర్‌లో పాల్గొన్నాయి. జలాంతర్గాములు ఐఎన్ఎస్ సింధుకీర్తి, సింధుకేసరి, సింధుఘోష్, కోస్ట్‌గార్డ్‌కు చెందిన నౌకలు, అత్యాధునిక పి-8 ఐ నిఘా విమానం, మిగ్ 29- కె జెట్ ఫైటర్‌లు, డార్నియర్ ఎయిర్ క్రాఫ్ట్‌లు, సీకింగ్, చేతక్ హెలికాప్టర్‌లు నీలి సంద్రంలో తమ వేగాన్ని, శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాయి. ఐఎన్ఎస్ విక్రాంత్‌పై మిగ్ విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లు, నిప్పులు చిమ్ముతూ ఎయిర్ క్రాఫ్ట్‌లు దూసుకెళ్లడం అందరినీ అబ్బురపరిచాయి.

## 27 ప్రాజెక్టులు, రూ.29,021 కోట్ల పెట్టుబడులకు సీఎం ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

రూ.29,021 కోట్ల విలువైన 27 ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేశారు. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 22,407 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఈ కీలక సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, పి.నారాయణ, కె.అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, కందుల దుర్గేశ్, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఐటీ, విద్యుత్, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక వసతులు, పరిశ్రమల రంగాల్లో ఈ కొత్త ప్రాజెక్టులు కొలువుదీరనున్నాయి.

ప్రాజెక్టుల పురోగతిపై ప్రతినెలా సమీక్ష

ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత కూడా ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో ముందుకు సాగకపోవడంపై సీఎం అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ప్రతీ నెలా ప్రాజెక్టుల పురోగతిపై తాను స్వయంగా సమీక్ష నిర్వహిస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థల యాజమాన్యాలతో అధికారులు నిరంతరం టచ్‌లో ఉంటూ, వారికి కావాల్సిన సహకారం అందించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్, బీపీసీఎల్ వంటి మెగా ప్రాజెక్టుల ఏర్పాటుకు ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని తేల్చిచెప్పారు. భూ కేటాయింపులు పొంది కూడా నిర్ణీత సమయంలో పనులు ప్రారంభించని సంస్థలతో చర్చలు జరపాలని, వారు ముందుకు రాకపోతే భూములను వెనక్కి తీసుకోవడానికి కూడా వెనుకాడవద్దని ముఖ్యమంత్రి గట్టిగా హెచ్చరించారు. దీనిపై మంత్రుల కమిటీ దృష్టి సారించి అవసరమైతే అనుమతులు రద్దు చేయాలని సూచించారు. రాష్ట్రంలో మరిన్ని సెమీ కండక్టర్ ప్రాజెక్టులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అలాగే సొంత భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి అదనపు ప్రయోజనాలు అందించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకునేలా ఎన్నారైలను పెద్దఎత్తున ఆహ్వానించాలని కూడా ఆయన నిర్దేశించారు.

**పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్‌పై ప్రత్యేక దృష్టి**

రాష్ట్ర పర్యాటక రంగాన్ని విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సూర్యలంక, పోలవరం, పులికాట్, గండికోట, శ్రీశైలం, మదనపల్లి, హార్సిలీ హిల్స్ వంటి ప్రాంతాల్లో క్లస్టర్లు ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకట్టుకునేలా షాపింగ్ మాల్స్, హోటళ్లు నిర్మించాలని అన్నారు. విశాఖలో నిర్మించ తలపెట్టిన 'భారత్ మండపం' దేశంలోనే అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్‌గా, ఒక ఐకానిక్‌గా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో 50 వేల హోటల్ రూములు లక్ష్యంగా పెట్టుకోవాలని, హెల్త్ టూరిజం, స్పోర్ట్స్ సిటీ, క్రియేటివ్ సిటీ వంటివి నెలకొల్పాలని అన్నారు. తిరుపతిని ఒక 'మ్యారేజ్ డెస్టినేషన్'గా తీర్చిదిద్దాలని, ఫుడ్ ప్రాసెసింగ్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని సూచించారు. ఆక్వా రంగంలో విలువ జోడింపు ద్వారా అమెరికాకు ఎగుమతులు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. యువతకు లభించిన ఉద్యోగాల వివరాలను 'నైపుణ్యం పోర్టల్'లో నమోదు చేసి, ఇంకా ఎన్ని ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయో రియల్ టైమ్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. త్వరలోనే కొత్త వేర్ హౌసింగ్ పాలసీని తీసుకురావాలని, ప్రధాన నగరాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచాలని కూడా సీఎం సూచించారు. ఇప్పటివరకు జరిగిన 15 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా రాష్ట్రానికి మొత్తం రూ.9,03,726 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించగా, వాటి ద్వారా 8,58,082 ఉద్యోగాలు వస్తాయని అధికారులు తెలిపారు.

## గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత

(మొదటిపేజీ తరువాయి)

సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్య మన్నారు. మహారాష్ట్ర ముంబయి బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఆ ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిరశక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలను కొనసాగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్‌జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పునరుద్ఘాటించారు.

పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేండ్లలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం తర్వాత తొలి నాలుగు దశాబ్దాల్లో విద్యావ్యవస్థ, నీటిపారుదల రంగాలు ప్రాధాన్యతాంశాలుగా ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్సీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు.

**భారత్‌లో వేగంగా సేవారంగం విస్తరణ**

1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం, సాఫ్ట్‌వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలను సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్‌వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని చెప్పారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు.

**2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ**

రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్తు అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయన్నారు. రాష్ట్రాభివృద్ధికి రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా విభజించినట్టు సీఎం వివరించారు. హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్)గా ప్రకటించగా, ఓఆర్ఆర్ 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశించినట్లు చెప్పారు. తయారీ రంగంలో చైనాకు ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**రాష్ట్రంలో రోజుకు 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగం**

రాష్ట్రంలో రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని సీఎం తెలిపారు. గత ఏడాది గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది 19,000 మెగావాట్లను దాటుతుందని అన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8శాతం లేదా దాదాపు 25శాతం గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని తెలిపారు. 360 కిలోమీటర్ల పొడవు గల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయని అన్నారు. డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని తెలిపారు.

**దేశంలో క్లైమేట్ ఎమర్జెన్సీ**

వాతావరణ మార్పులు, కోవిడ్ ప్రభావాల ప్రస్తుత పరిస్థితుల రీత్యా దేశంలో క్లైమేట్ ఎమర్జెన్సీ కొనసాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పన, ఉత్పత్తి, వినియోగం పెంపుదల కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. తెలంగాణ మూడు జోన్లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని తెలిపారు. హైదరాబాద్ ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో దేశంలో అత్యధికంగా ఈవీ వాహనాల వాడకం పెరుగుతోందని అన్నారు. ఈవీ తయారీ సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# సంపాదకీయం

## యెల్లో మెటల్ ధరల పతనానికి
## రష్యా మాస్టర్ స్ట్రోక్..





రష్యా తీసుకున్న ఒక కీలక నిర్ణయం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలపై పెను ప్రభావం పడే అవకాశం ఉందన్న వార్తలు ఇప్పుడు మదుపర్లలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. బంగారం ధరలు సామాన్యులకు షాకిస్తున్నాయి. గతేడాది కాలంగా గోల్డ్ ధరలు అంతకంతకూ పెరుగుతూ రికార్డులు క్రియేట్ చేస్తుంది. అటు వెండి సైతం బంగారంతో మించి పైపైకి దూసుకెళ్తుంది. అయితే నిన్నటి వరకు ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పసిడి ధరలు ఇప్పుడు దిగివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా భారత్‌లో ఒక సావరిన్ (ఎనిమిది గ్రాముల) బంగారం ధర రూ. 1,15,000 మార్కును దాటి.. సామాన్యులకు ఎనిమిదవ వింతలా మారుతుందేమోనన్న ఆందోళన కలిగించింది. అయితే తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు బంగారం ధరల పతనానికి నాంది పలికాయి. జనవరి 29 నుండి బంగారం ధరల్లో స్థిరమైన తగ్గుదల కనిపిస్తోంది. త్వరలోనే ఇది రూ. 1 లక్ష కంటే కిందికి పడిపోయే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు భారత మార్కెట్‌లో బంగారం ధరలు అనూహ్యంగా రూ. 1 లక్ష దిగువకు పడిపోయే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. రష్యా తన బంగారు నిల్వలను భారీగా విక్రయించాలని లేదా మార్కెట్‌లోకి వదలాలని తీసుకున్న నిర్ణయం వల్ల సరఫరా పెరిగి ధరలు తగ్గవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం రికార్డు స్థాయి ధరలతో ఉన్న పసిడి, ఈ పరిణామంతో సామాన్యులకు కొంత ఊరటనిచ్చే దిశగా సాగుతోంది. కామెక్స్ గోల్డ్ ధరలు త్వరలో ఔన్సుకి 3,000 డాలర్ల మార్కును తాకే అవకాశం ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రష్యా కదలికల వల్ల డాలర్ ఇండెక్స్‌లో వచ్చే మార్పులు , భౌగోళిక రాజకీయ పరిస్థితులు పసిడి ధరను ప్రభావితం చేయనున్నాయి. సరఫరా, డిమాండ్ మధ్య ఉన్న సమతుల్యత దెబ్బతినడం వల్ల ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు కావడంతో, అంతర్జాతీయ మార్కెట్ మార్పులు నేరుగా ఇక్కడి ధరలపై ప్రభావం చూపుతాయి. రష్యా నుండి వచ్చే సమాచారం నిజమైతే, దేశీయంగా 10 గ్రాముల బంగారం ధర గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే, ఇదే సమయంలో రూపాయి విలువ పతనం వంటి ఇతర అంశాలు కూడా ధరలను నియంత్రించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బంగారం ధరలు తగ్గవచ్చనే అంచనాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఒకవైపు ధరల పతనం ఆకర్షణీయంగా కనిపించినా, రష్యా వంటి పెద్ద ఆర్థిక శక్తుల నిర్ణయాలు మార్కెట్‌ను త్వరగా మార్చగలవు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమమని వారు అభిప్రాయపడుతున్నారు. బంగారం ధరలు అకస్మాత్తుగా తగ్గడానికి ప్రధాన కారణం రష్యా తీసుకున్న ఒక వ్యూహాత్మక నిర్ణయం. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. అంతర్జాతీయ వాణిజ్యంలో రష్యా తిరిగి అమెరికా డాలర్‌ను ఉపయోగించాలని నిర్ణయించుకుంది. గతంలో డాలర్‌ను బలహీనపరిచేందుకు రష్యా, చైనా వంటి దేశాలు భారీగా బంగారాన్ని నిల్వ చేశాయి. అయితే ఇప్పుడు రష్యా తిరిగి డాలర్ వైపు మొగ్గు చూపడంతో గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ విలువ అనూహ్యంగా పెరుగుతోంది. సాధారణంగా డాలర్ విలువ పెరిగినప్పుడు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం నుండి తప్పుకుని డాలర్ వైపు మళ్లుతారు. దీనివల్ల బంగారంపై డిమాండ్ తగ్గి ధరలు పడిపోతాయి.ట్రంప్ విధించిన ఆర్థిక ఆంక్షలను ధిక్కరించేందుకు ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు ఒక కూటమిగా ఏర్పడి డాలర్‌ను కాదని బంగారాన్ని నిల్వ చేశాయి. కానీ రష్యా ఇప్పుడు తన వైఖరిని మార్చుకుని తిరిగి డాలర్ ఆధారిత ట్రేడింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ప్రపంచ వాణిజ్య ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా బంగారం నిల్వలను మార్కెట్లోకి తెచ్చేలా ప్రేరేపిస్తోంది.ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,15,000 వద్ద ట్రేడ్ అవుతోంది. కానీ నిపుణుల అంచనా ప్రకారం.. యుద్ధ వాతావరణం, రాజకీయ అస్థిరత తగ్గడం వల్ల బంగారంపై ఒత్తిడి తగ్గింది. అంతర్జాతీయంగా డాలర్ పుంజుకోవడం వల్ల భారత్‌లో పసిడి ధర లక్ష రూపాయల లోపుకు చేరుకోవడం ఖాయమని తెలుస్తోంది.బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ, కొనుగోలుదారులు ఒకేసారి భారీగా పెట్టుబడి పెట్టకుండా ధరలు పూర్తిగా స్థిరపడే వరకు వేచి చూడటం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఏది ఏమైనా, పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న వేళ ధరలు తగ్గుతుండటం భారతీయ కుటుంబాలకు పెద్ద ఊరటనిచ్చే విషయమే. రష్యా నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ఆర్థిక మార్పులకు దారితీస్తుందో రానున్న రోజుల్లో చూడాలి.గతేడాది బంగారం ధరలు ఏకంగా 70% మేర పెరిగి రికార్డు స్థాయి రూ. 1.80 లక్షలను తాకాయి. అయితే, అంతర్జాతీయంగా ఔన్సు బంగారం ధర ప్రస్తుతం ఉన్న 5,000 డాలర్ల నుండి 3,000 డాలర్లకు పడిపోతే, దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ. 90,000 నుంచి రూ. 1,00,000 మధ్య స్థిరపడొచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.




## మేధస్సు గల వ్యవస్థలలో
# నమ్మకాన్ని నిర్మించడం బాధ్యతాయుత ఏఐ కర్తవ్యం

- ప్రొ. ముచ్చుకోట సురేష్ బాబు



**అనంతపురం – సూర్య వాస్తవం:**
కృత్రిమ మేధస్సు పరిశోధనా రంగంగా ప్రారంభమై, ఇప్పుడు ప్రభుత్వం, పరిశ్రమలు దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే ప్రాథమిక సాంకేతికతగా వేగంగా అభివృద్ధి చెందింది. ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ, విద్య, భద్రత ప్రజా విధానాల వంటి రంగాల్లో ఏఐ ఆధారిత వ్యవస్థలు కీలక నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బాధ్యతాయుత అభివృద్ధి, పరిపాలన అత్యంత అవస రంగా మారింది. బాధ్యతాయుత ఏఐ అనేది మేధస్సు గల వ్యవస్థలు నైతికత, పారదర్శకత, బాధ్యత సామా జిక విలువలకు అనుగుణంగా రూపకల్పన చేయబడి, అమలు చేయబడి, నిర్వ హించబడేలా చేసే ఒక వ్యవస్థీకృత రూపకల్పన. బాధ్యతాయుత ఏఐ బాధ్యతా యుత ఏఐ అనగా హానిని తగ్గించే, పక్షపాతాన్ని తగ్గించే, గోప్యతను రక్షించే సమానత్వం, భద్రతను ప్రోత్సహించే విధంగా ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడం, ఉపయోగించడం. ఇది కేవలం సాంకేతిక పనితీరుకే పరిమితం కాకుండా, సమాజంపై విస్తృత ప్రభావం, చట్టపరమైన అనుసరణ, నైతిక సమన్వ యాన్ని కూడా కలిగి ఉంటుంది. నైతిక ఏఐ ప్రధానంగా న్యాయం, మానవ హక్కులు వంటి నైతిక అంశాలపై దృష్టి పెడితే, బాధ్యతాయుత ఏఐ అనేది నైతికత, ప్రమాద నిర్వహణ, నియంత్రణ అనుసరణ కార్యాచరణ బాధ్యతలను సమగ్రంగా కలిగిన పరిపాలనా నమూనా. 2010 దశకంలో బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్ డీప్ లెర్నింగ్ అభివృద్ధి కారణంగా మెషిన్ లెర్నింగ్ విస్తృతంగా ఉపయోగించబడింది. దీనివల్ల అల్గారిథమిక్ పక్షపాతం, అపారదర్శక నిర్ణయ ప్రక్రియలు, వ్యక్తిగత డేటా దుర్వినియోగం, బాధ్యత లోపం వంటి నైతిక సవాళ్లు ఉద్భ వించాయి. ప్రస్తుతం జనరేటివ్ ఏఐ వ్యవస్థలు సంస్థల్లో వేగంగా అమలవుతున్నందున ఈ సవాళ్లు మరింత ప్రాముఖ్యత పొందాయి.

**నమ్మకపు స్తంభాలు**

ఏఐ స్వీకరణకు నమ్మకం ప్రాథమిక ఆధారం. భాగ స్వాములు ఏఐ వ్యవస్థలపై ఆధారపడాలంటే కొన్ని ముఖ్యమైన అంశాలు అవసరం.

**వివరణాత్మకత**

అనేక ఆధునిక ఏఐ నమూనాలు, ముఖ్యంగా డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లు, "బ్లాక్ బాక్స్" లాగా పనిచేస్తాయి. ఒక వ్యవస్థ ఏ నిర్ణయం ఎందుకు తీసుకుందో అర్థం కావాలి. ఖచ్చితత్వం పరీక్షలు, ధృవీకరణ ప్రక్రియలు విశ్వసనీయతను పెంచుతాయి. డేటా మూలాలు, నమూనా ఎంపికలు, ప్రక్రియల డాక్యుమెంటేషన్ ట్రేసబిలిటీ నిర్ధారిస్తుంది.

**సమానత్వం**

డేటాలో ఉన్న చారిత్రక అసమానతలు లేదా తక్కువ ప్రాతినిధ్యం వల్ల పక్షపాతం ఏర్పడవచ్చు. విభిన్న, ప్రాతినిధ్య డేటాసెట్‌లు, పక్షపాతం అవగాహన కలిగిన అల్గారిథమ్‌లు, ఫెయిర్‌నెస్ ప్రమాణాలు మరియు సమీక్షా కమిటీలు సమానత్వాన్ని నిర్ధా రించడంలో సహాయపడతాయి. అలాగే దృఢత్వం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఏఐ వ్యవస్థలు అసాధారణ పరిస్థితులు లేదా దాడులను తట్టుకునేలా ఉండాలి. నిరంతర పర్యవేక్షణ, సైబర్ భద్రతా చర్యలు, పరీక్షలు అవసరం. పారదర్శకత ఏఐ ఎలా నిర్మించబడింది, ఎలా అమలైంది అన్న విషయాల్లో స్పష్టత ఉండాలి. డేటా మూలాలు, శిక్షణ విధానాలు, పరిమితులు వెల్లడించాలి. ఈ మధ్యకాలంలో గోప్యత రక్షణ ప్రముఖంగా వినిపిస్తోంది. ఏఐ వ్యవస్థలు వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించే సందర్భంలో డేటా పరిపాలన, చట్టబద్ధ ప్రాసెసింగ్, అవగాహనతో సమ్మతి, భద్రతా చర్యలు తప్పనిసరి.

**బాధ్యతాయుత ఏఐ ఎందుకు ముఖ్యం?**

ఏఐ 2020లలో అత్యంత ప్రభావవంతమైన సాంకేతికతగా భావించబడుతోంది. వ్యక్తులు, సంస్థలు కీలక నిర్ణయా లకు అల్గారిథమ్‌లపై ఆధారపడుతున్నందున, అవి నమ్మదగినవిగాఉండాలి. బాధ్యతాయుత ఏఐ పక్షపాతాన్ని తగ్గిస్తుంది, పారదర్శకతను పెంచుతుంది, చట్టపరమైన అనుసరణను నిర్ధారిస్తుంది. భాగ స్వాముల నమ్మకాన్ని బలో పేతం చేస్తుంది. ఏఐ జీవచక్రంలో ముందుగానే ప్రమాదాలను గుర్తించడం ద్వారా సంస్థలు చట్టపరమైన, సామా జిక ప్రమాదాలను తగ్గించగలవు. అమలు విధానంబాధ్యతాయుత ఏఐ అమలు ఒకే దశలో పూర్తయ్యే ప్రక్రియ కాదు; ఇది మొత్తం జీవ చక్రంలో సమన్వయంతో ఉండాలి. సంస్థలు మొదట తమ విలువలకు అనుగుణమైన స్పష్టమైన సూత్రాలను నిర్వచించాలి. ఏఐ నిపు ణులు, న్యాయ నిపుణులు, నైతిక శాస్త్రవేత్తలు, వ్యాపార నాయకుల భాగస్వామ్యంతో విధానాలు రూపొందించాలి. ప్రభావ మూల్యాంకనాలు, పక్షపాతం పరీక్షలు, నిరంతర ఆడిట్లు, మానవ పర్యవేక్షణ అనివార్యం. గోప్యత, భద్రతా చర్యలను నిరంతరం నవీకరించాలి. భవిష్యత్తు దిశబాధ్యతాయుత ఏఐ ఒక నిరంతర నిబద్ధత. ఏఐ సాంకేతికతలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ పరిపాలనా రూపకల్పనలు కూడా అనుసరించాలి. పరిశ్రమ, అకాడెమియా, విధాన నిర్ణేతలు, పౌర సమాజం కలిసి పనిచేయడం ద్వారా మాత్రమే సాంకేతిక నవీనత సామాజిక విలువలకు అనుగుణంగా ఉంటుంది. సమానత్వం, పారదర్శకత, బాధ్యత, గోప్యత, భద్రతను తమ ఏఐ వ్యూహాలలో సమగ్రపరిచే సంస్థలు కేవలం ప్రమాదాలను తగ్గించడమే కాకుండా దీర్ఘకాలిక నమ్మకాన్ని నిర్మించగలవు. అల్గారిథమ్‌ల ఆధిపత్యం పెరుగుతున్న ఈ ప్రపంచంలో, నైతికమైన, నమ్మదగిన మేధస్సు గల వ్యవస్థలకు బాధ్యతాయుత ఏఐ బలమైన పునాది అందిస్తుంది.

# రాజోలులో రగులుతున్న జ్వాల



**కాకినాడ సూర్య వాస్తవం**
అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు అనగానే ఓ ప్రత్యేకత ఉంటుంది. జనసేన పార్టీ నుంచి వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యే గెలిచిన నియోజకవర్గం అది. అదికూడా జనసేన పార్టీకి మొట్టమొదటి ఎమ్మెల్యేను గెలిపించి
శుభారంభం ఇచ్చిన నియోజకవర్గం. ఈ నియోజకవర్గం అందుకే అంత ప్రత్యేకం. ఇదే విషయాన్ని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా చాలా సందర్భాల్లో ప్రస్తావించారు. రాజోలు ఒక చిరుదివ్వె లాంటిదని కూడా ఆయన ఎంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే ఈ నియోజకవర్గంలో మాత్రం జనసేన ఎమ్మెల్యే పనితీరుపై ఆ పార్టీలోనే అసంతృప్తి జ్వాలలు రేగుతోన్నాయా అన్న ప్రశ్నకు అవుననే సమాధానం ఆపార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఇదే నియోజకవర్గంలో టీడీపీ తన ఉనికిని కాపాడుకునేందుకు కూడా భారీ స్థాయిలో ప్రయత్నిస్తోంది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కుమార్తె గొల్లపల్లి అమూల్యను టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నియమించింది. దీంతో రాజోలులో టీడీపీలో కొత్త జోష్ నెలకొంది. కూటమి ప్రభుత్వంలో ఏ కార్యక్రమానికైనా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు సమాచారం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే రాజోలు నియోజకవర్గంలో మాత్రం టీడీపీ ఇంచార్జ్‌గా ఉన్న అమూల్యకు చాలా ప్రభుత్వ కార్యక్రమాలకు అసలు సమాచారం ఇవ్వడం లేదన్నది ఆమె తన అనుచరుల వద్ద వాపోతున్నారట.

ఇదే విషయాన్ని పార్టీ అధిష్టానానికి కూడా తెలిపినట్లు తెలుస్తోంది. నియోక వర్గాల్లో పలు నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ కూడా కనీస సమాచారం ఇవ్వకుండా తనకు నచ్చిన వారినే నియమించుకుంటున్నారని, వారి పార్టీ వరకు పరవాలేదు కానీ టీడీపీ నుంచి నియమించిన వారి విషయంలో కూడా తన వ్యతిరేకులకు కట్టబెట్టి తనకు వ్యతిరేక వర్గాన్ని పెంచి పోషిస్తున్నారని అమూల్య వాదనగా తెలుస్తోంది. ఉదాహరణకు ఇటీవలే ఇచ్చిన అంతర్వేది ఆలయ కమిటీ ఛైర్మన్ విషయంలోనూ ఇదే జరిగిందన్నది అమూల్య వర్గీయుల వాదనగా వినిపిస్తోంది. అంతర్వేది లక్ష్మి నరసింహస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పదవిని టీడీపీ నేతకే ఇచ్చామని ఎమ్మెల్యే దేవవరప్రసాదరావు చెబుతున్నా ఈ సమాచారం తనకు చెప్పలేదని, తాను ప్రతిపాదించిన పేరు వేరే నాయకుడిది కాగా వారికి అనుకూలమైన వారికే పదవి కట్టబెట్టారన్నది అమూల్య మాటగా చెబుతున్నారు ఆమె అనుచరులు. ఇదే కాకుండా నియోజకవర్గంలో నియమించిన పలు నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీకి ఇవ్వాల్సిన పదవుల్లో కూడా తన జోక్యం లేకుండా చేస్తున్నారని, నియోజకవర్గంలో అసలు ఒక ఇంచార్జ్ ఉన్నారన్న విషయాన్ని కూడా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని అమూల్య బాధపడుతున్నట్టు తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో జనసేన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాల్లో టీడీపీ అధిష్టానం కూడా జోక్యం చేసుకుంటున్న సందర్భాలు చాలా తక్కువనే చెబుతున్నారు విశ్లేషకులు. ఇదే విషయం రాజోలు నియోజకవర్గంలో కూడా వర్తిస్తుందంటున్నారు. అందులోనూ జనసేన అధినేతకు రాజోలు నియోజక వర్గం అంటే మరింత ప్రత్యేకం కాగా ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తోన్న దేవ వరప్రసాదరావు మాజీ ఐఏఎస్ అధికారి కావడం, ఆయనకు అధినేతతో అత్యంత సాన్నిహిత్యం ఉండడం ఆయన మాటే వేదం అవుతుందంటున్నారు. ఈ పరిస్థితుల్లో అంతర్గతంగా జనసేన, టీడీపీ నేతల మధ్య అసంతృప్తి పరిస్థితులున్నా కూడా అవేమీ ఇరు పార్టీ నాయకత్వాలు పట్టించుకునే పరిస్థితి ఉండదని, లైట్ తీసుకుంటున్నాయంటున్నారు.ఇదిలా ఉంటే జనసేన పార్టీలోనే ఎమ్మెల్యేపై అసంతృప్తి జ్వాలలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికే రెండు వర్గాలుగా అంతర్గత యుద్ధాలే జరుగుతున్నాయి.. అవి ఎంతలా అంటే సోషల్ మీడియా వేదికగా కూడా ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకునేంత స్థాయిలో అంతర్గత విభేధాలు భగ్గుమంటుండగా కొందరైతే బాహాటంగా ఎమ్మెల్యే పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

దీనికి తోడు ఇటీవల కాలంలో వైసీపీకకు చెందిన కొందరు జనసేన పార్టీలో దూరి ఎమ్మెల్యే అనుచరులుగా చక్రం తిప్పడం ముందు నుంచి పార్టీ జెండా మోసిన నాయకులు, కార్యకర్తలకు అసలు మింగుడు పడని అంశంగా మారింది. దీంతో ఎమ్మెల్యే తీరుపై కూడా కొందరు అధిష్టానానికి ఇప్పటికే ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీలో అంతర్గత పోరు విషయం ఇలా ఉంటే ఇక టీడీపీలో కూడా రెండు వర్గాలుగా మాటల యుద్ధం సాగుతోంది. ఇంచార్జ్ అమూల్యపై బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు ఆ పార్టీలోనే కొందరు నేతలు. అమూల్య ఒంటెద్దు పోకడలతో కొందరిని మాత్రమే వెంటేసుకుని వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. మొత్తం మీద రాజోలు నియోజకవర్గంలో అటు జనసేన, ఇటు టీడీపీలో అంతర్గత కోల్డ్ వార్ అయితే జరుగుతోందంటున్నారు.

# తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేత తవాస్మి హిందీ సంచిక ఆవిష్కరణ





**పులివెందుల – సూర్య వాస్తవం:** తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ గవర్నర్ శ్రీమాన్ జిష్ణు దేవ్ వర్మ, తెలంగాణ రాజ్ భవన్‌లో తవాస్మి హిందీ సంచికను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం తవాస్మి ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా తవాస్మి రచయిత శ్రీరామ చక్రధర్ మాట్లాడుతూ, గ్రంథాన్ని హిందీలోకి అనువదించిన శ్రీస్వామి ఉరుక్రమానందకి, భాషా సరలీకరణలో సహకరించిన పి. శివ మునెమ్మ కి కృతజ్ఞతలు తెలిపారు. ఇంతటి బృహత్ గ్రంథాన్ని అద్భుతంగా డిజైన్ చేసి, ప్రింటింగ్ దశ వరకు తీసుకువచ్చిన తవాస్మి సభ్యులు శ్రీమతి శారద దీప్తి కి, జాహ్నవి రెడ్డి కి, అలాగే ఈ ఆవిష్కరణ విజయవంతం కావడానికి సహకరించిన రితిక చక్రవర్తికి కృతజ్ఞతలు తెలియ జేశారు. గవర్నర్ తవాస్మిని నేటి యువతకు అత్యంత అవసరమైన విలువల ఆధారిత విద్యా కార్యక్రమంగా అభివర్ణించి, ఈ విలువలు దేశవ్యాప్తంగా పాఠశాల విద్యలో భాగం కావాలని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ ఆవిష్కరణతో తవాస్మి ఇప్పుడు ఇంగ్లీష్, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. రామాయణంలోని శాశ్వత విలువలను భావితరాలకు చేరవేయాలనే తవాస్మి ప్రయత్నంలో ఇది ఒక గొప్ప ముందడుగు. రామాయణంలోని జీవన విలువలను ప్రతి విద్యార్థికి, ప్రతి కుటుంబానికి, ప్రతి సమాజానికి చేరవేయాలనే ఈ యాత్రలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తవాస్మి బృందం ఆకాంక్షించింది.

# మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు వివాహ మహోత్సవ ఆహ్వానం



**పులివెందుల – సూర్య వాస్తవం:** పులివెందుల కాపు సంఘ నేతల ఆధ్వర్యంలో చిన్న కోట్ల ఆంజనేయులు కుమారుని ఆహ్వాన పత్రికను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అందజేశారు. బుధవారం తాడేపల్లిగూడెం లోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నివాసంలో పులివెందుల కాపు సంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి చిన్న కుడాల ఆంజనేయులు కుమారుడు చిన్నకోట్ల గురు సాయి తేజ కళ్యాణ పత్రికను వైయస్ జగన్మోహన్ రెడ్డి కి అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి క్షేమాలు అడిగి తెలుసుకుని అవకాశాన్ని బట్టి తప్పక హాజరవుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పులివెందుల బలిజ సంఘం అధ్యక్షులు గూడూరు గురు ప్రసాద్, రాచనేని ఆంజనేయులు, చిట్టి శ్రీ ప్రతాప్ మరియు పెళ్లి కుమారుడు తండ్రి చిన్న కోట్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రమేష్ నాయుడు జన్మదిన వేడుకలు



**వేంపల్లె – సూర్య వాస్తవం:**
అనకాపల్లి బీజేపీ ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ సీఎం రమేష్ నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేంపల్లి రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న అమ్మ అనాధాశ్రమంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి అన్న వితరణ పండ్లు పంపిణీ చేసి ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్యను ఘనంగా సత్కరించారు. అనంతరం గాలి హరి ప్రసాద్ మాట్లాడుతూ 28 సంవత్సరాలుగా నిస్వార్థంగా అనాథలను అక్కున చేర్చుకొని సేవలందిస్తున్న వెంకటసుబ్బయ్యను సత్కరించడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. పిల్లల ప్రేమాభిమానాలు కోల్పోయిన అనాథ వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని అన్నారు. అనాథల పట్ల సేవా తాత్పర్యం చూపడంతో పాటు వారికి అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు దొంతు సుమన్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబోయిన రవి యాదవ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు ముద్ది శివకృష్ణ, ఎస్టీ మోర్చా నాయ కులు రెడ్డి నాయక్, ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# అప్పులు చేయడంలో వైసీపీ, కూటమి ప్రభుత్వాలు దొందూ దొందే

- రైతుల రుణభారంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం:** రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేయడంలో, అప్పుల ఊబిలోకి దించడంలో అటు వైకాపా ప్రభుత్వం,ఇటు టిడిపి కూటమి ప్రభుత్వం దొందు దొందే అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. బుధవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం శక్తికి మించి అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందని టిడిపి కూటమి పార్టీలు విమర్శించాయి. అదే పని ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం చేస్తున్నదని తులసి రెడ్డి అన్నారు. ఒక విధంగా చెప్పాలంటే అంతకుమించి అప్పులు చేస్తున్నదని అన్నారు. కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్న సామెతలా ఉందని ఎద్దేవా చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అయింది. ఈ 20 నెలల కాలంలో రూ. 3,28,225 కోట్ల రూపాయలు అప్పు చేసింది.ఇందులో బడ్జెట్ ద్వారా ప్రత్యక్ష అప్పు రూ.1,79,668 కోట్లు, వివిధ కార్పొరేషన్ల ద్వారా రూ.1,01,170 కోట్లు, రాజధాని అమరావతి కోసం రూ.47,387 కోట్లు. ఈ అప్పు ఆల్ టైం రికార్డ్. ఇప్పటివరకు ఇంత స్వల్ప కాలంలో ఇంత ఎక్కువ అప్పు ఏ రాష్ట్రము చేయలేదు. అప్పుల్లో కూటమి ప్రభుత్వానికి ఆస్కార్ అవార్డు ఇవ్వచ్చని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.

కాగ్ నివేదిక ప్రకారం 2025- 26 ఆర్థిక సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలలో దేశంలోని 28 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఎక్కువ అప్పు చేసింది. ఆంధ్రప్రదేశ్ రూ.85, 269కోట్లు అప్పు చేయగా, తెలంగాణ రూ.65930 కోట్లు కర్ణాటక రు 19766 కోట్లు,కేరళ రూ.38,124 కోట్లు, తమిళనాడు రూ.72,130 కోట్లు, బీహార్ రూ.80092 కోట్లు, ఒరిస్సా రూ. 911 కోట్లు,ఉత్తర ప్రదేశ్ రు 11315 కోట్లు అప్పు చేశాయి. మనకంటే నాలుగు రెట్లు పెద్దదైన ఉత్తరప్రదేశ్ కేవలం రూ.11315 కోట్లు అప్పు చేయగా ఆంధ్రప్రదేశ్ రు 85 వేల 269 కోట్లు అప్పు చేయడం గమనార్హం.

2026- 27 బడ్జెట్లో రూ.98065 కోట్లు అప్పు చేస్తామని ప్రస్తావించడం జరిగింది. అంటే మొత్తం బడ్జెట్లో 30శాతం అప్పులే. ఇందులో వడ్డీలకు చెల్లిస్తున్నది 18 శాతం. ఏమి చేస్తున్నావు కోడలు పిల్ల అంటే ఉలకపోసి ఎత్తుకుంటున్నాను అత్తమ్మ అన్నట్లు ఉంది. అప్పులు తేవడం, వడ్డీలు చెల్లించడం ఇదే ప్రభుత్వం పని అన్నట్లుంది. రైతుల రుణభారంలో జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన ఉండడం శోచనీయం. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ పార్లమెంటులో చెప్పిన ప్రకారం జాతీయస్థాయిలో సగటు రైతు రుణభారం 74,121 రూపాయలు కాగా, ఆంధ్రప్రదేశ్లో సగటు రైతు రుణభారం రు 2,45,000 అంటే జాతీయ సగటు కంటే ఆంధ్రప్రదేశ్లో రైతుల రుణభారం 7 రెట్లు ఎక్కువగా ఉంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం శక్తికి మించి అప్పులు చేయవద్దని, రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేయవద్దని,రుణాంధ్రప్రదేశ్ చేయవద్దని కాంగ్రెస్ పార్టీ సూచిస్తుందని తులసి రెడ్డి అన్నారు. శనిగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షనీయం. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వీలైనన్ని ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. మద్యం మత్తులో మదనపల్లెలో కులవర్ధన్ అనే ఒక తాగుబోతు ఏడు సంవత్సరాల చిన్నారి రిషిక ప్రియ పై అత్యాచారం చేయడం,హత్య చేయడం అత్యంత విచారకరం.ఇప్పటికైనా మద్యం పాలసీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

# ఆధ్యాత్మిక సమాధులు పూర్వీకుల జ్ఞాపకాలకు ప్రతీకలు

- సమాధులపైగా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వ ఆలోచన తీవ్ర ఆందోళన కలిగిస్తుంది
- స్థానిక ప్రజలతో సంపూర్ణ చర్చలు జరపాలి
- పీసీసీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా




**రాయచోటి – సూర్య వాస్తవం:** మంగళగిరి యోజకవర్గం లోని ముస్లిం సోదరుల సమాధులపైగా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలనే ప్రభుత్వ ఆలోచన మాకు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా అన్నారు. సమాధులు కేవలం భూమి ముక్కలు కావు అవి ఒక సమాజపు భావోద్వేగాలని వారి ఆధ్యాత్మిక విశ్వాసాలు, పూర్వీకుల జ్ఞాపకాలకు ప్రతీకలని,భారత రాజ్యాంగం ప్రతి మతానికి సమాన గౌరవాన్ని, వారి ఆచార వ్యవహారాలకు రక్షణను హామీ ఇస్తుందని, అభివృద్ధి పేరుతో మతపరమైన సెంటిమెంట్లను దెబ్బతీయడం ప్రజాస్వామ్యానికి, సెక్యులర్ విలువలకు విరుద్ధం అని ఆయన చెప్పారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు.


కానీ అభివృద్ధి పేరుతో ఒక ప్రత్యేక వర్గ భావోద్వేగాలను పక్కన పెట్టడం అనైతికం. ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించి, సంబంధిత మత పెద్దలు, స్థానిక ప్రజలతో సంపూర్ణ చర్చలు జరపాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు. ఈ అంశంపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించకపోతే, మైనారిటీ హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమించడానికి వెనుకాడమని ఆయన చెప్పారు.సామాజిక సమైక్యత, పరస్పర గౌరవం, రాజ్యాంగ పరిరక్షణ ఇవే మా ధ్యేయం అని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ముస్లిం సోదరుల సమాధుల పైగా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టక ముందే కూటమి రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని ఆయన ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో బాబురావుకు రజత పతకం



**వేంపల్లె – సూర్య వాస్తవం:** స్థానిక శ్రీనివాస హైస్కూల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు టీ.బాబురావు, సీనియర్ పురుషుల 59 కిలోల బరువు విభాగంలో, ఫిబ్రవరి 14-15 తేదీన రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో అద్భుతమైన ప్రదర్శనతో రెండవ స్థానంలో నిలిచి రజత పతకం గెలుపొందారు. బాబురావు స్క్వాట్ లో 180 కిలోలు, బెంచ్ ప్రెస్ లో 82.5 కిలోలు, డెడ్‌లిఫ్ట్ లో 190 కిలోలు లిఫ్ట్ చేసి మొత్తం 452.5 కిలోలతో విజయం సాధించారు. కడప జిల్లాకు ప్రాతినిధ్యం వహించడానికి అవకాశం ఇచ్చినందుకు ఐఐఐటి ప్రొఫెసర్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బాలగోవింద్ తివారీకీ బాబురావు కృతజ్ఞతలు తెలిపారు. అధ్యాపకుడు మాట్లాడుతూ, "దీర్ఘకాలం ఆరోగ్యకరమైన జీవితం కోసం శారీరక వ్యాయామం చాలా ముఖ్యం. పిల్లలు అధికంగా సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించి, క్రీడలపై దృష్టి పెట్టాలి" అని సూచించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కేశవులు మాట్లాడుతూ టి.బాబురావు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తారని తాము ఆశిస్తున్నామని అన్నారు. అలాగే తోటి ఉపాధ్యాయులు ఈ విజయం పై హర్షం వ్యక్తం చేశారు.





# స్తంభాలగిరి దేవాలయ మాజీ ప్రధాన అర్చకులు మృతి

**దక్కిలి– సూర్య వాస్తవం:** దేవుని వెల్లంపల్లి శ్రీ స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి దేవస్థానం మాజీ ప్రధాన అర్చకులు గుడాలి ప్రభాకర్ శర్మ (80)శివైక్యం చెందారు. వారు శ్రీ స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి దేవస్థానం నందు సుమారు 15 సంవత్సరాలు ప్రధాన అర్చకులుగా పనిచేశారు. ప్రభాకర్ స్వామి మరణం పట్ల తన స్వగ్రామమైన వెంబులూరులు విషాదఛాయలు అలుముకున్నాయి. వారి మరణ వార్త పట్ల ప్రజలు విచారం వ్యక్తం చేశారు. పలువురు ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తు చేశారు. ఆయన పార్థివ దేహానికి వెంబులూరు లో బుధవారం స్మశాన వాటికలో అంత్యక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అభిమానులు, సన్నిహితులు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దివంగత ప్రభాకర్ శర్మ కుమారుడు చంద్ర శర్మ ప్రస్తుతం దేవుని వెలంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి దేవాలయం నందు అర్చకులుగా పూజా కార్యక్రమలు చేస్తున్నారు.

# జన సంద్రంగా గంగమ్మ జాతర

- అమ్మవారిని దర్శించుకున్న లక్షలాది మంది భక్తులు
- సంతానాన్ని ప్రసాధించవమ్మ అంటూ వరపడిన మహిళలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చాందిని బండ్లు
- భక్తుల దాహార్తిని తీర్చిన జర్నలిస్టులు, మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ..
- భక్తులను ఆకట్టుకున్న చెక్కభజన, కోలాటం
- జబ్బర్దస్, ఆర్కెస్ట్రాతో ఉర్రుతలూగిన యువత





**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** ఏడాదికి ఒకసారి జరిగే గంగమ్మ దేవత జాతరకు, లక్షలాది మంది భక్తులు తరలి రావడంతో అశేష భక్తజనసందోహంతో జాతర ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. బుధవారం ప్రారంభమైన గంగమ్మ దేవత జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దారులన్నీ జాతర వైపే కదిలాయి. దీంతో ఒక్కసారిగా గంగమ్మ దేవత జాతర జన సంద్రంగా మారింది. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణలో శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ దేవత అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతూ దర్శనమిచ్చిన అనంతపురం గంగమ్మ దేవతను భక్తులు కరుణించి కాపాడు అమ్మ అంటూ మొక్కుకున్నారు.

**ఊరూరా బోణాలతో మొక్కులు చెల్లింపు ...**

కస్తూరిరాజుగారిపల్లె గ్రామం చాగలగుట్టపల్లె అమ్మవారిని పూజాది కార్యక్రమాల అనంతరం అర్ధరాత్రి సమయంలో ఆరుబయట ఉంచారు. సాంప్రదాయ బద్ధంగా పళ్ళు కృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి కుటుంబ సభ్యులు మొదటి బోనంగా అమ్మవారికి జంతుబలులను సమర్పించారు. జాగారంకు తరలిన భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొడుతూ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. జాగారం కు వచ్చిన భక్తులకు అదే గ్రామానికి చెందిన దాతలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెల్ల వారుజామున మూడు గంటలకు బయలుదేరిన అమ్మవారు అప్పలరాజుగారిపల్లె, ఎస్సికాలనీ, మార్లవాండ్ల పల్లె, మర్రి చెట్టు, చౌటపల్లె గ్రామాల మీదుగా అత్యంత అంగరంగ వైభవంగా అమ్మవారి ఊరేగింపు సాగింది. ఈడిగపల్లె గౌడ్లుకళ్ళు సాంగ్యంతో అమ్మవారిని ఆలయంలోకి తీసు కెళ్ళుతూ సంతానం కోసం వరపడిన మహిళలు మీదుగా అమ్మవారిని ఆలయంలోకి చేర్చారు. వరపడిన మహిళలకు సిద్దుల పూజ అనంతరం సిద్దుల ప్రసాదమును అందజేసి భక్తులకు అమ్మవారి సర్వదర్శనాన్ని కల్పించారు. లక్షలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంతో పాటు క్యూ లైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. లక్కిరెడ్డిపల్లె జర్నలిస్టులతో పాటు మానవతా స్వచ్ఛంద సంస్థ, రాయచోటి మురళి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలోనూ నీళ్ల ప్యాకెట్లు మజ్జిగ ప్యాకెట్లు,నీళ్ల బాటిల్‌లు పంపిణీ చేసి ఒకింత భక్తుల దాహార్తిని తీర్చడంలో ప్రధాన పాత్ర పోషించారు. చాందిని ,కుంకుమ బండ్లు భక్తులను ఆకర్షింప చేశాయి. జాతరలో ఏర్పాటుచేసిన చెక్కభజన, కోలాటం, ఆర్కెస్ట్రా, జబర్దస్త్, రేలారే రేలా వంటి సాంస్కృ తిక కార్యక్రమాలు యువతను ఉర్రూతలూ గించాయి. ఈ సంవత్సరం రూ.300 దర్శనాన్ని ఏర్పాటు చేయడంతో విఐపి, వీఐపీల వారికి సులభతరంగా అమ్మవారి దర్శనం కలిగినట్లు అయింది. అమ్మవారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో దాతలు కడప సూర్య ఆసుపత్రి వైద్యులు దీనకర్ రెడ్డి సహకారం మరువలేనిదని ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, మదన్మోహన్, ఆదిములం చంద్ర, శివశంకర్ రెడ్డి లు అభినందించారు. జాతరలో ఎన్నడు లేనంత విధంగా మిఠాయి అంగళ్లు,శీతల పానీయాలు దుకాణాలు తో పాటు చెరుకుల బండ్లు ఎక్కువగా కనిపించాయి. డి.ఎస్.పి కృష్ణమోహన్, లక్కిరెడ్డిపల్లె సిఐ కృష్ణంరాజు నాయక్, లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ డి.శోభ ముందస్తుగా ఎక్కడికక్కడ ట్రాఫిక్కు అంతరాయం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో ఇబ్బందులు తలెత్తకుండా చూశారు. ఎండలు తీవ్రత మొదలవడం తో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ట్యాంకర్లును ఏర్పాటు చేసి భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. రెండు డ్రోన్, 20 సీసీ కెమెరాలు నిఘాలో జాతరను పోలీసులు పర్యవేక్షణ చేపడుతూ ఎక్కడికక్కడ ఇబ్బందులు తలెత్తకుండా ముందుకు సాగారు. మొక్కులు ఉన్నవారు అమ్మవారికి బోనాలు సమర్పించడంతోపాటు తలనీలాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో లక్షలాది మంది భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# లారీల దుమ్ముతో జనజీవనం అస్తవ్యస్తం

- ఇళ్లలోకి చొచ్చుకువస్తున్న దుమ్ము..
- ప్రజల కన్నీటి వేదన



**పెళ్లకూరు - సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పునబాక పంచాయతీ పరిధిలోని పీసీటి కండ్రిగ గ్రామంలో లారీల అధిక రాకపోకల వల్ల ఎగిసిపడుతున్న దుమ్ము ప్రజల జీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. గ్రామంలోని ప్రధాన రహదారిపై రోజంతా భారీ వాహనాలు సంచరిస్తుండటంతో దుమ్ము మబ్బులు కమ్ముకుని ఇళ్లలోకి చొచ్చుకువస్తున్నాయి. ఇళ్ల ముందర, గదులలో, పాత్రలపై, నీటి ట్యాంకులలో సైతం దుమ్ము పేరుకుపోతుండటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. చిన్నారులు బయట ఆడుకునే పరిస్థితి లేకపోవడంతో పాటు వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




"ఇలా దుమ్ము మధ్య ఎలా జీవించాలి?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గ్రామస్తులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకలేదని ఆరోపిస్తున్నారు. దుమ్ము నియంత్రణ చర్యలు వెంటనే చేపట్టాలని, రహదారిపై తరచూ నీరు చల్లాలని, లారీల వేగాన్ని నియంత్రించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## బండలాగు పోటీలలో ఓవలంపల్లి ఎద్దులకు మొదటి స్థానం

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** మండలంలోని అనంతపురం గంగమ్మ జాతరలో గురువారం మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ బాలయ్యగారి పల్లె గంగిరెడ్డి ఆధ్వర్యంలో బండలాగు పోటీలు నిర్వహించారు. పోటీలలో 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి.చెన్నూరు మండలం ఓవలంపల్లి సతీష్ కుమార్ రెడ్డి అనే రైతు ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి ఈ ఎద్దులకు రోడ్డు రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి 1లక్ష 1016 బహుమతులు అందించారు రెండో బహుమతి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పెండ్లిమర్రి మండలం బాలయ్య గారి పల్లెకు చెందిన విష్ణువర్ధన్ రెడ్డి ఎద్దులు రూ.80వేలు అందించారు. 3వ బహుమతి ఎద్దులకు మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ రూ. 60 వేలు, నాలుగవ బహుమతి కోనంపేట తప్పేపల్లి సర్పంచులు లక్ష్మీనారాయణ కేసవయ్యలు రూ.40 వేలు, ఐదవ బహుమతి కొనంపేట రజాక్ రూ.30వేలు ఆరవ బహుమతి పాలెం మాజీ ఎంపీటీసీ బీద గానీ రమణ రూ.20వేలు, ఏడవ బహుమతి మండల టిడిపి యువజన నాయకుడు కొలిమి పకీరయ్య రూ.7వేలు అందజేశారు. బండలాగు పోటీలో పాల్గొన్న మిగతా ఎద్లకు రూ.5వేలు చొప్పున మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ అందజేశారు.



## పూర్ణాహుతితో ఘనంగా ముగిసిన శివరాత్రి మహోత్సవాలు




**బ్రహ్మంగారిమఠం-సూర్య వాస్తవం:** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠంలో మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆధ్వర్యంలో ఈనెల 14 ప్రారంభమైన శివరాత్రి మహోత్సవాలు బుధవారం పూర్ణా హుతి కార్యక్రమంతో ముగిసినట్లు మఠం మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు. బుధవారం ఉదయం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపులో వసంతోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజలు భక్తులు ఆ వసంతాన్ని తీసుకొని తమ షాపుల్లో తలపై చల్లుకున్నారు. మధ్యాహ్నం పూర్ణాహుతి కార్యక్రమంలో మఠాధిపతులు శ్రీ శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారు పాల్గొన్నారు.

**భగవంతుని సేవలో భక్తులు- భక్తుల సేవలో పోలీసులు**

డి.ఎస్.పి రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై శివప్రసాద్, పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. అలాగే ప్రభుత్వ శాఖల అధికారులు భక్తులకు అందుబాటులో ఉండి సేవలు నిర్వహించారు.

# రజకులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

- రజక సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ
- బట్టల శుద్ధి యంత్రాలు పంపిణీ



**తలుపుల - సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని ఏటి గంగమ్మ ఆవరణంలో మండల వ్యాప్తంగా ఉన్న రజక సోదరులకు బట్టలు ఉతుక్కోవడానికి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద రజక కుటుంబలకు 167 మంజూరయ్యాయి వీటిని టిడిపి నాయకులు పంపిణీ చేశారు. అనంతరం రజక సంఘం నూతన క్యాలెండర్ల ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ కూటిమి ప్రభు త్వంలో రజకులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం రజక సోదరులు మాట్లాడుతూ తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని, అలాగే ధోబి ఘాట్‌లు నిర్మించాలని, రజకులపై దాడిలు జరగకుండా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మేడా శంకర్, కో- కన్వీనర్ వీర భార్గవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొమ్మేర క్రిష్ణ, రాజారెడ్డి, లగిడి.జయచంద్ర, రామ్మోహన, రాజశేఖర్, సాంబ సిపిఐ మండల కార్యదర్శి జగిలి ఈశ్వరయ్య రజక సంఘం మండల అధ్యక్షుడు జీవీ రమణ, నారాయణ, మండల ఉపాధ్యక్షుడు రవి, వెంకటేష్, వెంగముని, శంకర, రాము, రాంప్రసాద్, చిన్నప్ప, వెంకటరామయ్య, శివమ్మ, ఓబులమ్మ, వెంకట లక్ష్మమ్మ, వసుంధర, బేబీ, సుభద్ర, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

**కదిరి - సూర్య వాస్తవం:** కదిరి ఎస్‌టిఎస్ఎఎన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన కోర్సుల కొరకై ఆహ్వానం పలికారు, రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆదేశాల మేరకు సైబర్ సెక్యూరిటీ, మరియు సోషల్ మెడికో ఎనలైజ్, అప్లికేషన్ డెవలపర్, ల్యాబ్ అండ్ మొబైల్, గల కోర్సులు ఉచితంగా ప్రారంభించబడునని కళాశాల ప్రిన్సిపల్ స్మిత ఓ ప్రకటనలో తెలియ జేశారు, ఆసక్తి గల విద్యార్థి విద్యార్థులు ఈ క్రింది నంబర్లకు సంప్రదించవలసిందిగా కోరడమైనదని తెలియజేశారు 9390176421 ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు పై కోర్సులకు అడ్మిషన్ల కొరకై దరఖాస్తు చేసుకో గలరు. ఇంటర్మీడియట్ పాసై డిగ్రీ తత్సమానమైన విద్యార్థిని విద్యార్థులు అర్హులు.

## తహశీల్దారు కార్యాలయానికి నీటి కొరత

- పలుమార్లు తెలిపినా పట్టించుకోని ఎంపీడీవో




**తొండూరు - సూర్య వాస్తవం :** తొండూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో గత పది రోజులుగా తీవ్రమైన నీటి కొరత నెలకొంది. ఈ సమస్యపై పలుమార్లు ఎంపీడీవో విష్ణు ప్రసాద్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో కార్యాలయ సిబ్బంది, పనుల కోసం వచ్చే ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయ ప్రాంగణంలో తాగునీరు అందుబాటులో లేకపోవడంతో బయట నుంచి నీరు తెప్పించుకునే పరిస్థితి నెలకొంది. "మండల తహశీల్దార్ కార్యాలయానికే నీటి సమస్య ఉంటే గ్రామాలలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు" అని పలువురు ఉద్యోగులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తహశీల్దార్ కార్యాలయానికి తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు పేర్కొన్నారు.

## గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన లక్ష్మిప్రసాద్ రెడ్డి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ దేవతకి బుధవారం మంత్రి సోదరుడు పట్టు వస్త్రాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు,ఛైర్మెన్ వెంకటేశ్వర్లు, పూజారులు చంద్ర, గంగయ్య, రెడ్డిశేఖర్‌లు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో మంత్రి సోదరుడుకు స్వాగతం పలికారు. గంగమ్మ దేవతని దర్శించుకుని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మదన్, చెన్నకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణ భగవానుడి మందిరం సమస్య
# ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తాం

- ప్రాణాలు త్యాగం చేసైనా కాపాడుకుంటాం
- వై.నాగేశ్వరరావు యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్



**కర్నూల్ -సూర్య వాస్తవం :** కర్నూలులోని శ్రీకృష్ణ ఆలయంలో సుదర్శన యాగాన్ని విజయవంతం చేయాలని, వై నాగేశ్వరరావు యాదవ్, డాక్టర్ బాలమద్దయ్య యాదవ్, తిమ్మయ్య యాదవ్, అయ్యన్న యాదవ్, శేషిపాణి యాదవ్, శ్రీరాములు యాదవ్, నాగరాజు యాదవ్, నాగేశ్వరరావు యాదవ్,డాక్టర్ ఈశ్వరయ్య యాదవ్, డాక్టర్ చంద్రయ్య యాదవ్, సింధు నాగేశ్వర రావు యాదవ్, రాము యాదవ్, చంద్ర యాదవ్ ,నారాయణ యాదవ్, ప్రభాకర్ యాదవ్, వరుణ్ యాదవ్, మల్లికార్జున యాదవ్,తిక్కన్న యాదవ్, బిజెపి నాగరాజు యాదవ్,రాజు యాదవ్, పుల్లయ్య స్వామి, యాదవ కమిటీ సభ్యులు, విశ్వ విశ్వహిందూ పరిషత్ నాయకులు, బజరంగ్దళ్ నాయకులు, హిందూ బాంధవులు, బీసీ నాయకులు కోరారు. అదేవిధంగా శ్రీకృష్ణుని ఆలయం జోలికి వస్తే ప్రాణాలకు తెగించి పోరాడుతామని హెచ్చరిస్తున్నాం అన్నారు.



ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ కర్నూలు నగర హిందూ బంధువులందరికీ ఆహ్వానం. కర్నూలు నగరంలో నంద్యాల చెక్ పోస్ట్ శ్రీ కృష్ణుని దేవస్థానంలో ఫిబ్రవరి 17,18,19 వ తేదిలలో ఉదయం 10 గంటలకు "శ్రీ సుదర్శన హోమము" జరుగుతుంది. కావున భక్తదులందరూ పాల్గొని జయప్రదం చేయగలరని శ్రీ కృష్ణ ఆలయ కమిటి సభ్యులు కోరడం జరిగింది..అదేవిధంగా నంద్యాల చెక్ పోస్ట్ లో గల శ్రీకృష్ణ భగవానుని ఆలయాన్ని మునిసిపల్ అధికారులు ఆలయ స్థలం పైన సరైన సమాచారం లేకుండా సరైన అవగాహన లేకుండా మందిరాన్ని కూల్చివేస్తామని యాదవులను మానసికఆందోళన కు గురి చేస్తున్నారు. అధికారులకు ఆలయ భూమి అప్పటి కలెక్టర్ మరి ఆర్డిఓ డిఆర్ఓ ఎమ్మార్వో వారి ఆమో దంతోనే ఆలయాన్ని నిర్మించడం జరిగిందని అన్ని పత్రాలు మా దగ్గర ఉన్నాయని అలాగే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, లోకేష్ బాబుకి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస యాదవ్ కి, ఎంపీ మినిస్టర్ టీజీ భరత్ కి, నాగరాజుకి, ఎంపీ శబరికి, ఎమ్మెల్యే చరిత రెడ్డి దృష్టి కి తీసుకొని వెళ్లి ఈ ఆలయాన్ని కాపాడుకోవడానికి మా ప్రాణాన్ని సైతం లెక్క చేయమని తెలియజేశారు.

# పని భారం తగ్గించండి

- గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ మస్తాన్ డిమాండ్




**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల మరణాలపై హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలి, ఇటీవల ఒత్తిడి తట్టుకోలేక సచివాలయంలోనే ఉరి వేసుకొని ఉద్యోగులు మరణిస్తున్నారని ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని అన్నారు ఈ మరణాలకు నిరసనగా బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల కూడలి దగ్గర శాంతి ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ మస్తాన్ కో కన్వీనర్ జిల్లా కోకన్వీనర్ కె.వి నాగార్జున జేఏసీ మండల ప్రెసిడెంట్ సి రామ సుబ్బారెడ్డిమాట్లాడుతూ ఇటీవల కాలంలో సర్వేల భారంతో అధికారుల ఒత్తిడి వల్ల ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఇది బాధాకరమైన విషయం అని అన్నారు ఒకేసారి సర్వేలను నిర్వహించమని ఒత్తిడి చేయడం ఎంతవరకు కరెక్ట్ అని అన్నారు కుటుంబ సర్వేల ప్రజల సహకారం కూడా పూర్తిగా అవసరమని అందులోనూ సర్వర్ కూడా సరిగా పనిచేయడం లేదని ఇదే సమయంలో అక్షరాంధ్ర అని 14 శాఖలకు కేటాయించవలసిన బిఎల్ఓ డ్యూటీలను కేవలం సచివాలయ ఉద్యోగులకు మాత్రమే కేటాయించడం ఎంతవరకు కరెక్ట్ అని ఆవేదన వ్యక్తం చేశారు, సచివాలయాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరని ఇతర జాబులు వచ్చి కొంతమంది సెలవులో మరి కొంతమంది సిబ్బంది వెళ్లారని అదేవిధంగా గ్రామ వార్డు సచివాలయ శాఖ మండల కార్యాలలోకి కొంతమంది ఉద్యోగులను డిప్యూటేషన్ మీద పంపారని ఈ పని భారం అంతా ఇతర ఉద్యోగుల మీద పడుతోందని అన్నారు ఇటీవల అన్నమయ్య జిల్లాలో సచివాలయంలో ఉరి వేసు కున్న కార్యదర్శికి 800 మందికి పైగా మ్యాపింగ్ చేయడం వంటి పని ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారని ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మనవి చేశారు ఒక శాఖ అధికారులు కాకుండా అనేకమంది అధికారులు ఒత్తిడికి గురిచేయడం వల్లే మరణాలు సంభవిస్తున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మూడు నెలల వ్యవదిలో 50 మంది మరణించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఒత్తిడికి గురి చేసే అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని మనవి చేశారు ఈ కార్యక్రమంలో రవి శంకర్ చంద్ర యాదవ్ అశోక్ కుమార్ శ్రీజా రాణి నాగలక్ష్మి తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో
# శక్తి యాప్‌పై వర్క్ షాప్



**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా శక్తి యాప్ మరియు మహిళా భద్రత చర్యలపై వర్క్ షాప్ జరిగినదని కళాశాల ప్రిన్సిపల్ డా.బి. శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మంజూరైన పీఎం ఉష 3 పిఏబిలో భాగంగా మా కళాశాలకు ఈ కార్యక్రమం ఇవ్వడం జరిగింది. మహిళలు భద్రతాపరమైన సమస్య లను ఈ యాప్ ద్వారా సులభంగా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లకు సమాచారం చేరవేసి రక్షణ పొందవచ్చు అని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డా.సి బాలనారాయణ మాట్లాడుతూ ఈనాడు సోషల్ మీడియా ప్రాధాన్యత పెరగడం వలన ప్రతి యాప్‌ను అనవసరంగా వాడ కూడదు, అలా వాడడం వల్ల కొన్ని అనర్థాలు కూడా జరుగుతాయని అన్నారు. ఈ వర్క్ షాప్ కోఆర్డినేటర్ తెలుగు విభాగాధిపతి డా.కె.విజయలక్ష్మి మాట్లాడుతూ మన పురాణాలు మహిళల రక్షణకు కౌమారంలో తండ్రి, యవనంలో భర్త, వృద్ధాప్యంలో పుత్రులు రక్షించేవారు అని తెలిపాయి.ఆధునిక కాలంలో మహిళ విద్యా, ఉద్యోగ, వ్యాపార రీత్యా ప్రతిరంగంలో ప్రగతి చెందుతున్న పరిస్థితుల్లో తనకు తాను రక్షణ పొందలేనప్పుడు ప్రభుత్వం రూపొందించిన ఇటువంటి యాప్‌ల ద్వారా రక్షణ కలుగుతుందని అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పట్టణ ఎస్సై మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఇన్ స్టాగ్రామ్ ఫేస్ బుక్ ఉపయోగిస్తున్నప్పుడు తెలియని వ్యక్తులతో పరిచయాలను పెంచుకొని ఫోటోలను షేర్ చేయడం వలన ప్రమాదంలోకి నెట్టివేసే ఆస్కారం ఉంటుందని ఇటువంటి విషయాల్లో జాగ్రత్త అవసరం అని అన్నారు. మహిళా కానిస్టేబుల్ కే.నర్మద మాట్లాడుతూ మహిళల నడవడికను, వస్త్రధారణను,




ట్రాఫిక్ రూల్స్ గురించి వివరిస్తూ అమ్మాయిలు తీసుకునే జాగ్రత్తలను వివరించారు.ఉదాహరణలతో సహా యాప్‌ను గురించి వివరించారు.హెడ్ కానిస్టేబుల్ బి.మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ యుక్త వయసులో తల్లిదండ్రుల మాట పెడచెవిన పెట్టి ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందులు ఎదుర్కొని కౌన్సెలింగ్ కోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ ఉంటారని ఇటువంటి విషయాల్లో మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని భవిష్యత్తులో పూలబాట వేసుకోవాలని అన్నారు.సచివాలయం మహిళా పోలీస్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా శక్తి యాప్ విద్యార్థులతో ఇన్స్టాల్ చేయించారు. ఉపన్యాసాల అనంతరం విద్యార్థులకు వర్క్ షాప్ సర్టిఫికెట్స్ అందజేశారు. అతిథులను శాలువాలతో సన్మానించారు. తదుపరి లిఖిత వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి డా.యు శ్రీనిత, డా.రమీజా, హేమావతి, ప్రవల్లిక, ప్రభావతి, మస్తాన్ బి, వాణి,ప్రశాంతి. సువర్ణ,కరిష్మా విద్యార్థులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్స్ సమస్యలపై అసెంబ్లీలో
# గళం వినిపించిన ఎమ్మెల్యే

- కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం : ఏపీఎస్పీ కానిస్టేబుల్స్
- బండారు శ్రావణిశ్రీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన రాష్ట్ర ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు



**అనంతపురం - సూర్య వాస్తవం:** శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ పనితీరుపై, వారి కష్టాలపై బుధవారం నాడు అసెంబ్లీలో తన గళం విప్పారు. ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ సిబ్బంది, ప్రధాన సమస్యల గురించి ఆమె అసెంబ్లీలో తన వాణి వినిపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ వారి కుటుంబాలు బండారు శ్రావణిశ్రీకు ఏపీఎస్పీ హృదయపూర్వకంగా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ సిబ్బంది వాట్సాప్, ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్‌లలో ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడిన వీడియో చూసి ఎమ్మెల్యే కు వారు మెసేజ్‌లతో సంతోష వ్యక్తం చేశారు. వారి సమస్య కు పరిష్కారం గతంలో ఇచ్చినట్లు ఒకసారి 100శాతం కన్వర్షన్ ప్రభుత్వం నుండి తీసి ఆ ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా తీసుకుంటే సరిపోతుంది అని వ్యక్తపరుస్తూ సిబ్బంది, కుటుంబాలు ఎమ్మెల్యేకు కూటమి ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటారని చెప్పారు.

## ముస్లిం కుటుంబాలకు
# 'రంజాన్ తోఫా' పంపిణీ



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తిపట్టణంలోని మదరసాలో బుధవారం ముందస్తుగా రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ మహబూబాషా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. పేద ముస్లిం కుటుంబాలు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే లక్ష్యంతో 180 కుటుంబాలకు నిత్యావసరాలు అందించారు. తోఫా పంపిణీ ద్వారా పేదలకు అండగా నిలవడం అభినందనీయమని డీఎస్పీ పేర్కొన్నారు.

# బాల్య వివాహాలు లేని సమాజమే లక్ష్యం




**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి మండలం తొండపాడు గ్రామంలో బుధవారం బాల్య వివాహ రహి త కమిటీ సభ్యులు పర్యటించారు. సామాజిక కార్యకర్త పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో మార్చి 8న నిర్వ హించనున్న ఉచిత వివాహాల రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. వధూవ రులకు నిర్ణీత వయస్సు నిండి ఉం డాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాల నిరోధానికి సహకరించాలని ఆలయ ధర్మకర్తలు,కమిటీ సభ్యులకు సూచించారు. చట్ట వ్యతిరేక వివాహాలు జరగకుండా అప్రమ త్తంగా ఉండాలని కోరారు.

## రంజాన్ పవిత్ర మాసానికి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ




**నాయుడుపేట - సూర్య వాస్తవం:** ప్రపంచ వ్యాప్తంగా పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణు లందరికీ నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ టిడిపి అధ్యక్షుడు 786 రఫీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆత్మపరిశుద్ధి, ఉపవాస దీక్ష, క్రమశిక్షణ మరియు దానగుణానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసాలు ఆచరిస్తున్న ప్రతి ఒక్కరిపై అల్లాహ్ దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కుటుంబాల్లో ఐక్యత, ప్రేమాభిమానాలు పెంపొందించే పవిత్ర కాలం రంజాన్ మాసమని తెలిపారు. భక్తి, నియమ నిష్ఠలతో గడిపే ఈ మాసం ప్రతి ఇంటిలో సుఖశాంతులు నింపాలని, సమాజంలో సోదరభావం మరింత బలపడాలని కోరుకున్నారు. ప్రజలందరూ శాంతి, సామరస్యాలతో పండుగను జరుపుకోవాలని, ఉపవాస దీక్షలను భక్తిశ్రద్ధలతో ఆచరించాలని రఫీ పిలుపునిచ్చారు.



# ' నా విజయ రహస్యం నువ్వే ' : చిరంజీవి

హైదరాబాద్ : " నా విజయ రహస్యం ఏమిటని ఎవరైనా అడిగితే.. నా ప్రతిభ, కృషి కాదు.. నువ్వే అని చెబుతాను. " అని మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. తాను ఈ స్థాయిలో ఉండడానికి కారణం తన భార్య సురేఖ అని అన్నారు. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా కొన్ని ఫొటోలు పంచుకున్న చిరు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. " నా ప్రతి అడుగులో నా వెంట నడిచిన నీకు శుభాకాంక్షలు. 1980 ఫిబ్రవరి 20న మనం వివాహం చేసుకున్న నాటినుంచి నువ్వే నా బలంగా మారావు. ఈరోజు నీ పుట్టినరోజుతో పాటు రెండు రోజుల ముందుగానే మన వివాహ వార్షికోత్సవం కూడా చేసుకోవడం నాకు ఆనందంగా ఉంది. నీ ప్రేమ, ఆప్యాయతలతో కుటుంబం మొత్తాన్ని నడిపిస్తున్నావు. నా తల్లిని సొంత బిడ్డలా చూసుకుంటావు. నా విజయ రహస్యం ఏమిటని ఎవరైనా అడిగితే.. నా ప్రతిభ, కృషి కాదు.. నువ్వే అని చెబుతాను. నువ్వు కుటుంబ బాధ్యతను చూసుకున్నావు కాబట్టే నేను నటనపై శ్రద్ధ పెట్టాను. కష్టసుఖాల్లో మమ్మల్ని ఒకేతాటిపై నడిపించావు. నీవల్లే నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను " అని చిరు తన ప్రేమను వ్యక్తం చేశారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ఇటీవలే 'మనశంకర



వరప్రసాద్ గారు'తో సూపర్ హిట్‌ను అందుకున్న ఆయన ప్రస్తుతం 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా కనిపించనున్నారు. దీన్ని జులై 9వ తేదీన ప్రేక్షకుల ముందుకుతీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు.

# 45 ఏళ్ల 'ప్రేమాభిషేకం'




తెలుగు సినీ చరిత్రలో అక్కినేని నాగేశ్వరరావు కెరీర్‌లో చిరస్థాయిగా నిలిచిపోయిన 'ప్రేమాభిషేకం' చిత్రం విడుదలై బుధవారానికి 45 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ చారిత్రాత్మక మైలురాయిని పూర్తి చేరుకున్న సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసి ఏఎన్ఆర్‌కి ఘనంగా నివాళులు అర్పించింది. దాసరి నారాయణరావు దర్శకత్వంలో, అక్కినేని వెంకట్, నాగార్జున నిర్మాణంలో 1981 ఫిబ్రవరి 18న విడుదలైన ఈ చిత్రం అప్పట్లో సరికొత్త రికార్డులను సృష్టించింది. ముఖ్యంగా ఎనిమిది కేంద్రాలలో ఏకధాటిగా 365 రోజులకు పైగా ప్రదర్శితమై, తెలుగు చిత్ర పరిశ్రమలో తొలి 'ప్లాటినమ్ జూబ్లీ' చిత్రంగా చరిత్రలో నిలిచిపోయింది.

# 20న 'బుకీ' తెలుగులో విడుదల



అజయ్ దిషన్, ధనుషా జోడీగా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బుకీ'. విజయ్ ఆంటోనీ సమర్పణలో శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై రామంజేయులు జవ్వాజీ నిర్మించారు. సునీల్, లక్ష్మీ మంచు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే తమిళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ రెస్పాన్స్‌ని అందుకుంది. తెలుగులో ఈ సినిమా ఈనెల 20న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. 'భాష్యశ్రీతో 'బిచ్చగాడు' నుంచి జర్నీ కొనసాగుతోంది. ఈ సినిమాకి కూడా అద్భుతమైన మాటలు రాశారు. అజయ్ 'మారన్'తో చాలా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ సినిమాలో కూడా అతని నటన మీ అందరినీ అలరిస్తుంది. ధనుషా స్క్రీన్‌పై చాలా క్యూట్‌గా ఉంటుంది. ఈ సినిమాలో మంచు లక్ష్మీ, సునీల్ పెర్ఫార్మెన్స్ అదిరిపోతుంది. ఈ సినిమా క్లైమాక్స్ చూస్తున్నప్పుడు ఖచ్చితంగా కన్నీళ్లు వస్తాయి. అంతా రిలేట్ చేసుకునేలా ఉంటుంది. నిర్మాత రామ్‌తో 'మార్గన్' నుంచి అసోసియేషన్ ఉంది. సురేష్ ప్రొడక్షన్స్‌కి కృతజ్ఞతలు' అని మూవీ ప్రజెంటర్, మ్యూజిక్ డైరెక్టర్ విజరు ఆంటోనీ అన్నారు. డైరెక్టర్ గణేష్ చంద్ర చిత్ర విశేషాలు వెల్లడించారు.



- నెదర్లాండ్స్‌పై 17పరుగుల తేడాతో టీమిండియా గెలుపు
- 21న సూపర్-8లో దక్షిణాఫ్రికాతో ఢీ

# ధనాధన్ దూబే




అహ్మదాబాద్: టి20 ప్రపంచకప్‌లో టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌కు ముందే సూపర్-8కు చేరిన భారతజట్టు.. బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లోనూ ఘన విజయం సాధించింది. దీంతో గ్రూప్-ఎ టాపర్‌గా ముగించింది. నరేంద్ర మోడీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 193పరుగుల భారీస్కోర్ చేయగా.. అనంతరం నెదర్లాండ్స్‌ను 20ఓవర్లు ముగిసేసరికి 7వికెట్ల నష్టానికి 176పరుగులకే పరిమితం చేసింది. టీమిండియా బౌలర్లు వరుణ్ చక్రవర్తికి మూడు, దూబేకు రెండు, బుమ్రా, హార్దిక్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దూబేకు దక్కింది. అంతకుముందు భారత బ్యాటర్ శివమ్ దూబే విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. కేవలం 31బంతుల్లో 4ఫోర్లు, 6 సిక్సర్లతో 66 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. దూబే మెరుపులతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 193 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(0) డకౌట్‌గా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ (18) వేగంగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ (31), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(34) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ నిలకడగా ఆడి వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. అనంతరం క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా(30)తో కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా దూబే తనదైన శైలిలో భారీ షాట్లతో నెదర్లాండ్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. హార్దిక్ కూడా మూడు సిక్సర్లతో రాణించాడు. ఆఖర్లో రింకూ సింగ్(6 నాటౌట్) కూడా ఓ సిక్సర్ బాదడంతో భారత్ భారీ స్కోరు అందుకుంది. నెదర్లాండ్స్ బౌలర్లలో లోగాన్ వాన్ బీక్‌కు మూడు వికెట్లు, ఆర్యన్ దత్‌కు రెండు వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు...ఇండియా ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (బి)ఆర్యన్ దత్ 0, ఇషాన్ కిషన్ (బి)ఆర్యన్ దత్ 18, తిలక్ వర్మ (సి)వాన్-డెర్ మెర్వ్ (బి)బీక్ 31, సూర్యకుమార్ (సి)గుక్టెన్ (బి)క్లెన్ 34, దూబే (సి)గుక్టెన్ (బి)బీక్ 66, హార్దిక్ (సి)మెర్వ్ (బి)బీక్ 30, రింకు సింగ్ (నాటౌట్) 6, అదనం 8. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 193పరుగులు.

వికెట్ల పతనం: 1/0, 2/39, 3/69, 4/110, 5/186, 6/193

బౌలింగ్: ఆర్యన్ దత్ 4-0-19-2, వాన్-బీక్ 4-0-56-3, అకెర్మన్ 3-0-36-0, క్లెన్ 4-0-38-1, లీడే 4-0-28-0, వాన్-డెర్-మెర్వ్ 1-0-15-0.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: లెవిట్ (సి)సుందర్ (బి)హార్దిక్ 24, మ్యాక్స్ (బి)వరుణ్ చక్రవర్తి 20, బెస్-డే-లీడే (సి)వరుణ్ చక్రవర్తి (బి)దూబే 33, అకెర్మన్ (సి)రింకు సింగ్ (బి)వరుణ్ చక్రవర్తి 23, ఆర్యన్ దత్ (బి)వరుణ్ చక్రవర్తి 0, ఎడ్వర్డ్స్ (బి)బుమ్రా 15, లియాన్ కచెట్ (సి)సుందర్ (బి)దూబే 26, క్రాస్ (నాటౌట్) 25, వాన్-బీక్ (నాటౌట్) 4, అదనం 6. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 176పరుగులు.

వికెట్ల పతనం: 1/35, 2/51, 3/94, 4/94, 5/112, 6/125, 7/172


బౌలింగ్: ఆర్షదీప్ 3-0-22-0, బుమ్రా 3-0-17-1, సుందర్ 4-0-36-0, వరుణ్ చక్రవర్తి 3-0-14-3, హార్దిక్ 3-0-40-1, అభిషేక్ 1-0-10-0, దూబే 3-0-35-2.

# ఘనంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ జన్మదిన వేడుకలు

- పాత్రికేయులు, పారిశుధ్య కార్మికులకు హెల్మెట్ల పంపిణీ
- సేవా కార్యక్రమాలతో సార్థకత




**నాయుడుపేట – సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ జన్మదిన వేడుకలు బుధవారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు షేక్ రఫీకి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం 786 సేవా సంఘం ఆధ్వర్యంలో షేక్ రఫీ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని సి.ఎస్. తేజ సెంటర్ వద్ద మీడియా మిత్రులు, శానిటేషన్ మేస్త్రీలకు ద్విచక్ర వాహన హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేయగా, అన్నా క్యాంటీన్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు లను షేక్ రఫీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు షేక్ రఫీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజహిత సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయుడుపేట పోలేరమ్మ ఆలయ చైర్మన్ నానబాల సుబ్బారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జివిఆర్ నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పలుకూరు ముత్యాలయ్య, నిత్య కృష్ణారెడ్డి, కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య, జువ్వలపాటి మస్తాన్, కందనూరు విజయ్, పసల చెంగయ్య, మొండెం బాబు, రేవతి, హైమావతి, శేషం మునిగోపి తదితరులు పాల్గొని షేక్ రఫీకి శుభాకాంక్షలు తెలియజేశారు. సేవా కార్యక్రమాలతో జన్మదినాన్ని సార్థకం చేసిన షేక్ రఫీని పట్టణ ప్రజలు, పార్టీ శ్రేణులు అభినందించారు. రోడ్డు భద్రత, పేదల సంక్షేమం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.







# కూటమి ప్రభుత్వంపై ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ ఆశలు..



- గతంలో 100 పర్సెంట్ జీవో విడుదల చేసిన ఘనత చంద్రబాబు దే
- కుటుంబాలకు దూరంగా.....
- కూటమి ప్రభుత్వంలో వారి కోరిక తీరున...?
- ఆశ తో ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ ఎదురుచూపు....!

**అమరావతి క్రైమ్ – సూర్య వాస్తవం:**

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ విధులు అత్యంత కఠినంగా, సవాళ్లతో కూడుకున్నవి. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, సాయుధ బందోబస్తు, మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలు, క్లిష్ట పరిస్థితుల్లో శాంతిని నెలకొల్పడం వంటి కీలక బాధ్యతలను ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ సిబ్బంది నిర్వహిస్తారు. ఇవి సాధారణ పోలీసుల కంటే భిన్నంగా సాయుధ బెటాలియన్ల రూపంలో పనిచేస్తాయి.ఏపీ ఎస్పీ పోలీసుల కుటుంబాలకు వెల్ఫేర్స్ లేకపోవడం.....తమ కుటుంబాలతో సమయానికి గడపలేక పోవడం...నెలకు ఒకసారి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉండటం సరైన సమయంలో తమ కుటుంబాలకు న్యాయం చేయలేక పోవడం ముఖ్యంగా వారి పిల్లలకు చదువు లు ఒకే చోట చదవించుకోలేక పోవటం.... ఆరోగ్య పరంగా కుటుంబ సభ్యులకు ఏమీ సమస్యలు వచ్చిన దగ్గర ఉండి చూపించి లేకపోవడం వల్ల ఎందుకంటే నెలకు ఒకసారి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితులు...

ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో కుటుంబం,పిల్లలు చదువులు ఉంటాయి అని ఎవరు ఆలోచించక పోవడం ప్రధాన కారణాలు. కుటుంబాలకు దూరంగా వారికి ఏమి జరిగిన దగ్గర ఉండలేని పరిస్థితి ఏపీ ఎస్పీ సిబ్బంది పరిస్థితులు..... కానిస్టేబుల్ వారి తండ్రులు చనిపోతే ఇంటికి వెళ్ళలేని... ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఎంతో ఆఫ్ డెట్ అడ్వాన్స్ పరిస్థితి లో ఉన్న కూడా స్పెషల్ పోలీస్ సిబ్బంది పరిస్థితులు మాత్రం బ్రిటీష కాలం నాటి కష్టాలే ఉన్నాయని సిబ్బంది వాపోతున్నారు.ఈ కూటమి ప్రభుత్వం లో అయిన వారి మారుతాయని ఆశతో ఎదురుచూస్తున్నారు.మన రాష్ట్రంలో వివిధ జిల్లాలలో ఉన్నా 08 బెటాలియన్లలో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ కొన్ని వేల మంది సిబ్బంది మరియు వారి కుటుంబాల సమస్యల గురించి గతంలో ఏపీఎస్పీ సిబ్బంది చాలా దూర ప్రాంతాలలో విధులు నిర్వహిస్తూ నెలకు ఒకసారి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి వారి కుటుంబాల సమస్యలు తెలుసుకుని అప్పటి ముఖ్యమంత్రి అయిన నారా చంద్రబాబునాయుడు వారి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో వాటి స్థలం లో 100% కన్వర్షన్ గా జిల్లా ఆర్మడు రిజర్వ్ పోలీస్ విధులకు పంపించడం జరిగింది. అప్పటివరకు బాగా ఉండేది 2010 లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో చీశీ.329 తీసుకొచ్చి 40% కన్వర్షన్ వెళ్లాలని జీవో తీసుకురావడం జరిగింది దాని ద్వారా సిబ్బంది అందరూ చాలా నష్టపోవడం జరిగింది. కుటుంబ న్యాయం చేయాలని సిబ్బంది ఎదురుచూస్తున్నారు.ఇందులో ఏ. ఆర్ (ఆర్మ్డ్ రిజర్వ్) కన్వర్షన్ సమస్య రిటైర్మెంట్ అయినా ఖాళీలు చనిపోయిన వారి ఖాళీలు లో 40% ఇవ్వటం ద్వారా 21, 22, 23 సంవత్సరాలు అయినా ఏ.ఆర్ కన్వర్షన్ రాక కానిస్టేబుల్ గానే రిటైర్మెంట్ అవుతూ ఫ్యామిలీలకు దూరంగా ఉంటూ సరైన టైంలో ఫ్యామిలీలోకి దగ్గర ఉండక కొంతమంది ఫ్యామిలీని కూడా కోల్పోతున్నాము అని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు....



**ప్రధాన అంశాలు:**

1. ఏపీ ఎస్పీ సిబ్బంది ఏ. ఆర్ కాన్వర్షన్ కోసం 10 సంవత్సరాలు పూర్తి అయినా వారు కన్వర్షన్ లో వారి సొంత జిల్లాలకు పోవాల్సి ఉండగా జిల్లాలో రిటైర్మెంట్, చనిపోయిన సిబ్బంది ఖాళీలలో 40% కోటాలో అని 2 లేదా 3 ఖాళీలను చూపించటం ద్వారా 21,22,23 సంవత్సరాలు పూర్తయిన కానీ డి ఎ ఆర్ కన్వర్షన్ పంపించకపోగా మరియూ 6,12,18 సంవత్సరాల ఇంక్రిమెంట్స్ ఇవ్వకపోగా ఆర్థికంగా నష్టపోతూ డి ఎ ఆర్ కన్వర్షన్ పంపించిన 7 సంవత్సరాల సర్వీసు జూనియర్ గా కుచ్చబెడుతున్నారు దాని ద్వారా ఆర్థిక నష్టం సర్వీస్ నష్టం కోల్పోతున్నారు అయిన కన్వర్షన్ కోసం చూస్తునే ఉన్నారు..
2. ఈ సమస్యకు పరిష్కారం కోసం ఎదో ఒక రోజు న్యాయం జరుగుతుంది అని ఎదురుచూస్తున్నాము అని సిబ్బంది మరియు వారి కుటుంబాలు చెబుతున్నారు.
3. రాష్ట్రంలో వేలాది మంది సిబ్బంది లో కన్వర్షన్ కోసం 4200 మంది ఉన్నారని, వారిని జిల్లాలో ఖాళీలలో కొన్ని బ్యాచ్‌లు వరకు విడతలుగా పంపిస్తారని ఎదురుచూస్తూ.. ఇప్పుడు జరిగే రిక్రూట్‌మెంట్‌లో ఏ.ఆర్ రిక్రూట్‌మెంట్ లేదు కావున 100% డి ఎ ఆర్ కన్వర్షన్ ఇచ్చి కొత్తగా ఏర్పడిన జి జిల్లాలకు ఇచ్చే విధంగా ప్రభుత్వం ద్వారా జీవో జారీ చేయాలని కోరుతున్నారు.

# బొత్స సత్యనారాయణ పట్టు కోల్పోయారు నారా లోకేశ్

- తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంపై మండలిలో చర్చకు పట్టుబట్టిన వైసీపీ
- వైసీపీ తీర్మానాలను డిస్మిస్ చేసిన మోషేన్ రాజు

అసెంబ్లీలో చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారన్న బొత్స

**అమరావతి- సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో తిరుమల నెయ్యి కల్తీ వ్యవహారంపై చర్చకు వైసీపీ మళ్లీ పట్టుబడుతోంది. నిన్న ఈ విషయమై వైసీపీ తీర్మానం ఇవ్వగా మండలి ఛైర్మన్ మోషేన్ రాజు తిరస్కరించారు. నేడు కూడా అదే సీన్ రిపీట్ అయింది. ఇందాపూర్, హెరిటేజ్ నెయ్యి సరఫరాపై చర్చకు తీర్మానాన్ని ఇవ్వగా మోషేన్ రాజు డిస్మిస్ చేశారు. దీంతో మండలి విపక్ష నేత, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "టీటీడీలో ఇందాపూర్, హెరిటేజ్ నెయ్యి సరఫరాపై చర్చించాల్సిన అవసరం ఉంది. అసెంబ్లీలో ఈ వ్యవహారంపై చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారు. అందుకే మండలిలో చర్చకు మేము డిమాండ్ చేస్తున్నాం" అన్నారు. బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీ లాబీలో నిర్వహించిన చిట్ చాట్‌లో స్పందించారు. "శాసనమండలిలో ఉన్న వైసీపీ సభ్యులపై బొత్స సత్యనారాయణ పట్టు కోల్పోయారు. వైసీపీ నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు వేర్వేరుగా వాయిదా తీర్మానాలు ఇచ్చారు. ఒకరు లడ్డూ కల్తీపై చర్చించాలని, మరొకరు ఇందాపూర్ డెయిరీపై చర్చించాలని అడిగారు. ఈ ఇద్దరు ఎమ్మెల్సీల్లో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి" అని వ్యాఖ్యానించారు.

# ఘనంగా దీన్నేపాటి గంగమ్మ తల్లి తిరుణాల

- ఆకట్టుకున్న ఎద్దుల బండలాగుడు పోటీలు
- ప్రత్యేక అతిథిగా హాజరైన ఎంపీ అవినాష్ రెడ్డి

**పులివెందుల – సూర్య వాస్తవం:** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం గ్రామం కదిరి రోడ్డులో కొలువై ఉన్న దీన్నేపాటి గంగమ్మ తిరుణాల వేడుకలు బుధవారం ఘనంగా కొనసాగగా, ప్రత్యేక ఆకర్షణగా ఎద్దుల బండలాగుడు పోటీలు నిలవగా జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాలను పురస్కరించుకుని ఆలయ పరిసరాలు ప్రాంతాలను అత్యంత వైభవంగా అలంకరించగా ఉదయాస్తమాన అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా నిర్వాహకుల ఆహ్వానం మేరకు జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాలు కొనసాగగా ఒంగోలు గిత్తలచే బండలాగుడు పోటీలను జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మున్సిపల్ ఇంచార్జ్ మనోహర్ రెడ్డి, మరియు స్థానిక కౌన్సిలర్ విజయ్ కుమార్ రెడ్డి ఇతర నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించగా ప్రథమ ద్వితీయ మరియు తృతీయ స్థానాలలో గెలుపొందిన ఎద్దులకు నగదు బహుమతులు మరియు మిగిలిన స్థానాలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాలలో వెంకటాపురం గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో మార్క్‌ఫెడ్ కేంద్రాల ఏర్పాటు

- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం

**పులివెందుల – సూర్య వాస్తవం:** శనగ పంటను మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్న విషయాన్ని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత అధికారులు మార్క్ఫెడ్ కొనుగోలు కేంద్రాల ద్వారా శనగ పంట కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు. జిల్లాలో 80వేల హెక్టార్లలో శనగ పంట పండించి చేతికి రాగా అమ్మకాలకు సంబంధించి సరైన వేదికలు లేకపోవడంతో రైతాంగం అత్యంతరం లేక పండించిన పంటను తక్కువ ధరకు దళారుల చేతిలోకి వెళుతున్న విషయాలను రైతాంగం జిల్లా ఎంపీ వై ఎస్ అవినాష్ రెడ్డి దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎంపీ రైతుల కష్టాలను జిల్లా కలెక్టర్ చెరుకూరు శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లగా మార్గాలను అన్వేషించిన జిల్లా కలెక్టర్ మార్క్ఫెడ్ కేంద్రాల ద్వారా సెనగ పంటను కొనుగోలు చేసేందుకు ఆదేశాలు జారీ చేస్తూ మరియు అదే విధంగా శనగ క్వింటాల్‌కు రూ.5,875 చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రైతాంగ సమస్యల పట్ల సత్వరం స్పందించి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సహకరించిన ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డికి మరియు అధికార యంత్రాంగానికి రైతాంగం కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాష్ట్రంలో మహిళలకు చిన్నారులకు భద్రత కరువవుతుంది

- దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలాప్రసాద్

**పులివెందుల – సూర్య వాస్తవం :** రాష్ట్రంలో మహిళలకు చిన్నారులకు పొద్దున 6 గంటలకు భద్రత కరువవుతుందని, దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలాప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ మదనపల్లి టౌన్ నీరుగుటపల్లిలో 7 ఏళ్ల చిన్నారి రిషిక ప్రియను అతి దారుణంగా హత్య చేసిన ఘటన త్రివర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆయన అన్నారు. మహిళా, బాలికల భద్రతపై ప్రభుత్వం పదేపదే హామీలు ఇస్తున్నప్పటికీ కులవర్ధన్ లాంటినీచులకు భయం లేకుండా పోయిందన్నారు. ఇలాంటివారిని కఠినంగా శిక్షిస్తే ఇంకొకరికి భయం పడుతుందన్నారు. ఈ కేసులో నిందితుడిని పోలీసులు త్వరగాపట్టుకుని చట్టపరంగా అత్యంత కఠిన శిక్ష విధించాలని ఆయన కోరారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )